

# సిద్ధప్పా.. ఇదేందప్పా

విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి వారిని సక్రమైన మార్గంలో నడిపించేందుకు విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాలలకు పంపిస్తారు..కాని దేవాలయలాంటి పాఠశాలలు నేడు వ్యాపార సముదాయాలుగా మారాయి..ఇంటర్నేషనల్ స్కూల్స్ పేరుతో కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలు నిబంధనలు ఉల్లంఘించి పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి.. భవనానికి ఆక్యుపెన్సీ, నిర్మాణ అనుమతుల పత్రాలు, ఫైర్ సేఫ్టీ లేకుండానే విద్యాశాఖ అధికారులు రాక్ వెల్ ఇంటర్నేషనల్ స్కూల్ నడిపేందుకు అడ్డదారిలో అనుమతులు జారీ చేయటంపై తీవ్ర విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి..జీవో 111ను తుంగలో తొక్కుతున్నప్పటికి హైడ్రా కు ఇవేమి కనిపించవా..? ఫైర్ సేఫ్టీ లేని కారణంగా అగ్నిప్రమాదాలు సంభవించి పిల్లల ప్రాణాలు పోతేగాని స్పందిస్తారా..? అంటు విద్యావేత్తలు సైతం ప్రశ్నిస్తున్నారు.







(మహా స్పెషల్ టాస్క్ ఫోర్స్ )
రంగారెడ్డి జిల్లా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ శంషాబాద్ సర్కిల్ పరిధిలో శాతంరాయి గ్రామంలో రాక్ వెల్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం అడ్డదారిలో విద్యాశాఖ నుండి అనుమతులు పొందింది.అధికారులు, ప్రజా ప్రతినిధుల అండదండలతో జీవో 111ను తుంగలో తొక్కింది.జీ హెచ్ ఎం సీ నుండి ఎటువంటి నిర్మాణ అనుమతులు తీసుకోకుండానే 8.5ఎకరాల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టింది. జీ వో 111 ప్రకారం ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జంట జలాశయాలకు పది కిలోమీటర్ల పరిధిలో బహుళంతస్తుల నిర్మాణాలు, వరద ప్రవాహానికి చెక్ డ్యామ్ లు, రాతి కట్టడాలు చేపట్టారాదంటూ జీవో స్పష్టంచేస్తోంది.. 100 గజాల జాగాలో కేవలం 20 గజాల్లో నిర్మాణం చేసుకొని విగిలిన 80గజాల స్థలంలో గ్రీనరి మొక్కలు పెంచుకోవాల్సి ఉంటుందిని జీవో స్పష్టంచేస్తోంది.కానీ 8.5 ఎకరాలలో స్కూల్ నిర్మించి జీవో 111 ను ప్రవేశపెట్టిన ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సీ. అర్జున్ రావు కే సవాల్ విసిరింది.జీవో 111 లో స్కూల్ భవన నిర్మాణాలు చేపట్టారు కాబట్టి ప్రభుత్వం నుండి ఎటువంటి అనుమతులురావు .దాంతో ఆక్యూఫెన్సి సర్టిఫికెట్ జారీ చేయరు.సర్టిఫికెట్ ఇవ్వక పోవటంతో ఫైర్ సేఫ్టీ అధికారులు నోబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు సంబంధిత అధికారులు నిరకరించారు.రాక్ వెల్ ఇంటర్నేషనల్ స్కూల్ యజమాన్యం డబ్బే పరమావధిగా పెట్టుకొని లక్షలాది రూపాయలు ఒకొక్క విద్యార్థి నుండి వసూళ్లు చేస్తోంది.. దురదృట్టాపు శాతు అగ్ని ప్రమాదాలు జరిగితే చంటి పిల్లల పరిస్థితి ఏంటి.. అనే అనుమానాలు స్థానికులతో పాటు విద్యావేతల్లోను వ్యక్తమవుతున్నాయి.ఇదలావుంటే కంచే చేనును మేస్తే కాసేదివరంటూ. జీ హెచ్ ఎం సీ లో ఓ ఉన్నాతాదికారి కొడుకు ఇదే స్కూల్లో చదవటం విశేషం.. అక్రమాలను అడ్డుకోవలసిన జీ హెచ్ ఎం సీ అదికారులే స్కూల్ యాజమాన్యంతో అంటకాగటం జీవో లను, చట్టాలను కాలరాసేది అధికారులు కాదా అనే ప్రశ్నలు స్థానికంగా ఉత్పన్నమౌతున్నాయి..ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం, హైడ్రా అధికారులు స్పందించి ధనవంతుడికి ఒక న్యాయం పేదోడికి ఒక న్యాయం అన్నట్లు కాకుండా పిల్లల జీవితాలను దృష్టిలో పెట్టుకొని ఎటువంటి అనార్థాలు జరకముందే రాక్ వెల్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పుర ప్రముఖులు, విద్యావేత్తలు కోరుతున్నారు.

# సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం

( మొదటి పేజీ తరువాయి )
జాతీయ జెండాను ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి సుదీర్ఘంగా ప్రసంగించారు. సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తూ.. ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా వినూత్న పథకాలను అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి సగర్వంగా ప్రకటించారు. పాలనా పగ్గాలు చేపట్టిన గత 30 నెలల కాలంలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో విజయవంతమయ్యామని, భవిష్యత్ తెలంగాణ అభివృద్ధి కోసం రూపొందించిన 'తెలంగాణ రైజింగ్2047' విజన్ డాక్యుమెంట్ ద్వారా రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్తామని ఆయన ఈ వేదికపై నుంచి ఉద్ఘాటించారు.

**అమరుల త్యాగాలకు ఘన నివాళి**
ప్రజా కవి కాళోజీ నారాయణరావు రచించిన 'పుట్టుక నీది, చావు నీది.. బతుకంతా దేశానిది' అనే స్ఫూర్తిదాయక వాక్యాలను ఉటంకించిన ముఖ్యమంత్రి, రాష్ట్ర హితం కోసమే తమ ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని ఉద్ఘాటించారు. పరేడ్ గ్రౌండ్స్ వేడుకల కంటే ముందు అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్క్ వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రి, పలువురు మంత్రులు, పీసీసీ చీఫ్‌తో కలిసి అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ కలను సాకారం చేయడంలో ఆనాడు కీలక పాత్ర పోషించిన మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీకి యావత్ తెలంగాణ సమాజం తరఫున ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజలు తమకు అప్పగించిన అధికారాన్ని పాలనగా కాకుండా ఒక పవిత్రమైన బాధ్యతగా భావిస్తున్నామని, కొద్దిమంది చేతుల్లో అధికారం బందీ కాకూడదనే ఉద్దేశ్యంతోనే నాలుగు కోట్ల ప్రజల ప్రతినిధిగా తమ వ్యవస్థ పనిచేస్తోందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**రైతుల అభ్యున్నతికే పెద్దపీట**
తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయమే వెన్నెముక అని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. రైతులను వ్యవసాయ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే బృహత్తర లక్ష్యంతో అడుగులు వేస్తున్నామన్నారు. 202526 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 236.87 లక్షల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి నమోదైందని వివరించారు. అన్నదాతల అప్పుల బాధను తీర్చేందుకు ఒకేసారి రెండు లక్షల రూపాయల వరకు పంట రుణమాఫీ అమలు చేశామని, ఈ క్రమంలో దాదాపు 25 లక్షల మంది రైతులను రుణ విముక్తులను చేస్తూ 20,616 కోట్ల రూపాయలను వారి ఖాతాల్లో జమ చేశామని ముఖ్యమంత్రి వెల్లడించారు. అలాగే రైతు భరోసా పథకం కింద ఇప్పటివరకు 27,529 కోట్ల రూపాయలను నేరుగా రైతుల ఖాతాల్లోకి బదిలీ చేశామన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలన్న దృఢ సంకల్పంతో గత రెండున్నరేళ్లలో ధాన్యం కొనుగోళ్ల కోసమే



82,840 కోట్ల రూపాయలు వెచ్చించామని, యాసంగి సీజన్‌లో దేశవ్యాప్తంగా సేకరించిన ధాన్యంలో 60 శాతం తెలంగాణ నుంచే ఉండటం రాష్ట్ర వ్యవసాయ శక్తికి నిలువెత్తు నిదర్శనమని ఆయన కొనియాడారు.

**విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు**
యువతకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ఎలాంటి న్యాయపరమైన అడ్డంకులు లేకుండా అత్యంత పారదర్శకంగా 67,763 ఉద్యోగాలను భర్తీ చేసి దేశానికే ఆదర్శంగా నిలిచామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గ్రూప్1, గ్రూప్2, గ్రూప్3, గ్రూప్4 పరీక్షలతో పాటు మెగా డీఎస్సీ ద్వారా ఈ పోస్టులను భర్తీ చేశామన్నారు. నిరుద్యోగులకు మరింత శుభవార్త చెబుతూ, ఈ నెలలోనే టీజీపీఎస్సీ ద్వారా ఇంజినీరింగ్, కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ), అటవీశాఖ, టౌన్‌ప్లానింగ్, విద్యాశాఖల్లో మరిన్ని ఉద్యోగ ప్రకటనలు జారీ చేయనున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే దిశగా 1,362 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించామని, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటు వంటి చర్యలు చేపట్టామన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అల్పాహారం (బ్రేక్‌ఫాస్ట్) అందించే పథకంతో పాటు, జూనియర్ కళాశాల విద్యార్థులకు సైతం మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

**ఇందిరమ్మ ఇళ్లతో సొంతింటి కల సాకారం**
పేదలకు సొంతింటి కల నెరవేరడం మాటల్లో చెప్పలేని ఆనందాన్నిస్తుందని, వారిని అద్దె ఇళ్ల బాధల నుంచి విముక్తి చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. పేదలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కొత్త రేషన్‌కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి మొదటి ఏడాదే 22,500 కోట్ల రూపాయలు కేటాయించి 4.5 లక్షల ఇళ్లను మంజూరు చేశామన్నారు. కేవలం 13 నెలల వ్యవధిలోనే 1.25 లక్షల ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేసి పేదల సొంతింటి కలను సాకారం చేశామని, సెప్టెంబర్ 17 నాటికి మరో రెండు లక్షల ఇళ్లను పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 3.50 లక్షల ఇళ్లను మంజూరు చేశామని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే ప్రణాళికలో భాగంగా క్యూర్ పరిధిలో ఈసారి లక్ష ఇందిరమ్మ ఇళ్లను నిర్మించనున్నట్లు ఆయన ప్రకటించారు.

**మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి**
మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే సమాజం అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశ్యంతో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే బృహత్తర కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రేవంత్ రెడ్డి తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఒక లక్ష కోట్ల రూపాయల రుణాలు అందించాలనే లక్ష్యంతో అడుగులు వేస్తున్నామని, ఇప్పటికే 60 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను మహిళలకు అందించామని వివరించారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం, 500 రూపాయలకే వంట గ్యాస్ సిలిండర్, మహిళా శక్తి భవనాల నిర్మాణం వంటి పథకాలు మహిళల ఆర్థిక స్వావలంబనకు ఎంతగానో తోడ్పడుతున్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

**లక్ష్యం ఒక్కటే...తెలంగాణ రైజింగ్-2047**
రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించిన 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి తన ప్రసంగంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ ప్రాం

తాలుగా విభజించి అభివృద్ధికి మూడంచెల వ్యూహాన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ స్థాయి సర్వీసెస్ హబ్‌గా మార్చడంతో పాటు, ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్ మధ్య ప్రాంతాన్ని భారీ తయారీ పరిశ్రమల కేంద్రంగా, మిగతా ప్రాంతాలను వ్యవసాయ ఆధారిత అభివృద్ధి మండలాలుగా తీర్చిదిద్దుతామన్నారు. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి ఏకంగా మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా నిలబెట్టడమే ప్రభుత్వ అంతిమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే కాదు, యావత్ ప్రపంచానికే ఒక గేట్‌వేగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ విజన్ డాక్యుమెంట్ కేవలం ఒక పత్రం కాదని, రాబోయే తరాల భవిష్యత్తును నిర్మించే ఒక మహత్తర కార్యాచరణ అని ఆయన ఉద్ఘాటించారు. ఈ వేడుకల సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన పలువురు పోలీసు అధికారులకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా విశిష్ట సేవా పురస్కారాలను ప్రదానం చేశారు.

**ఆరోగ్య రంగానికి భారీ పెట్టుబడులు**
దేశ చరిత్రలోనే తొలిసారిగా సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ కుల గణన సర్వేను తెలంగాణ ప్రభుత్వం విజయవంతంగా పూర్తి చేసిందని సీఎం వెల్లడించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే చారిత్రాత్మక చట్టాన్ని ఆమోదించడంతో పాటు, ఎస్సీ ఉపవర్గీకరణను సైతం పక్కాగా అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజల ఆరోగ్య రక్షణ కోసం వైద్య రంగానికి 11 వేల కోట్లకు పైగా నిధులు వెచ్చించామన్నారు. వరంగల్ హెల్త్ సిటీ, టిమ్స్ ఆసుపత్రులు, నిమ్స్ విస్తరణ, ఉస్మానియా ఆసుపత్రి నూతన భవన నిర్మాణంతో పాటు 17 కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణం శరవేగంగా కొనసాగుతోందన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు రాజీవ్ ఆరోగ్యశ్రీ కవరేజీని 5 లక్షల నుంచి 10 లక్షల రూపాయలకు పెంచినట్లు గుర్తు చేశారు.

**రాష్ట్రవ్యాప్తంగా అంబరాన్నంటిన సంబరాలు**
తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు పూర్తి చేసుకుని 13వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న వేళ రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామ పంచాయతీల నుంచి ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రజా ప్రతినిధుల కార్యాలయాల్లో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఖమ్మం గ్రౌండ్స్‌లో జరిగిన భారీ వేడుకల్లో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఇక తెలంగాణ అసెంబ్లీలో ఉదయాన్నే వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. శాసనసభ, శాసనమండలిలో నిర్వహించిన ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో స్పీకర్ గడ్డం ప్రసాద్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ సాధన కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను వారు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

# తెలంగాణ బరాబర్ మా అయ్య జాగీరే

**హైదరాబాద్, మహా :** ఎస్.. మిస్టర్ పవన్ కళ్యాణ్. తెలంగాణ బరాబర్ మా అయ్య జాగీరే. తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల జాగీరు.. నీ అయ్య జాగీరు కాదు అంటూ జనసేన పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. మంగళవారం హైదరాబాద్‌లో జనసేనాని పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ గాంధీభవన్ వేదికగా స్పందించారు. మిస్టర్ పవన్ కళ్యాణ్.. ఇది మా అయ్య జాగీరే అని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. పవన్ కల్యాణ్ ఇక్కడికి వచ్చి పీకేదేంటీ? అని ఆయన ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ పెయిడ్ ఆర్టిస్ట్ అని అభివర్ణించారు. తన దగ్గర డబ్బులు ఉంటే తాను కూడా పవన్‌తో ఒక క్యారెక్టర్ చేయిస్తానన్నారు. తెలంగాణపై పవన్ కళ్యాణ్ మరోసారి అక్కసు వెళ్లగక్కారంటూ మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన వ్యక్తి పవన్ అని తెలిపారు. గద్దర్‌కు కారు కొనిచ్చా అని చెప్పినందుకు ముందు క్షమాపణ చెప్పాలంటూ పవన్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. చనిపోయిన వారి గురించి మాట్లాడాల్సిన అవసరం ఏంటి? అని అన్నారు. తనకి ఆంధ్రాలోనే దిక్కు లేదని పవన్ చెప్పుకున్నాడని వ్యంగ్యంగా అన్నారు. ఉద్యమ సమయంలో కూడా ఆంధ్రా వాళ్ళని మేం ఏం అనలేదన్న పొన్నం మేం ఆంధ్రా వాళ్ళని ఏదో అన్నట్టు పవన్ కల్యాణ్ అబద్ధాలు చెబుతున్నాడంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఏ బిల్లు చేసినా తలుపులు మూసే**
పార్లమెంటులో ఏ బిల్లు చేసినా తలుపులు మూసే పాస్ చేస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పుకొచ్చారు. కొండగట్టుకు ఇచ్చిన పైసలు మీ అయ్య జాగీరా? అన్నారు. అయినా కొండగట్టుకు వస్తే ప్రోటోకాల్‌తో స్వాగతించి గౌరవించామని గుర్తు చేశారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు మీటింగ్ పెట్టడం గెలకడం కాదా? అంటూ అసహనం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ తిరిగితే జనాలు వస్తారు కానీ ఓట్లు వేయరని ఎద్దేవా చేశారు. పవన్ కళ్యాణ్ వచ్చినా, పోయినా మాకేం సంబంధం లేదన్నారు. తెలంగాణ ఎప్పుడైనా ఏపీ ప్రజలను స్వాగతిస్తూనే ఉంటుందని చెప్పారు. సినిమా నటుడిగా పవన్ ఎక్కడ తిరిగినా తమకేం ఇబ్బంది లేదన్నారు. తెలంగాణపై తనకు ఉన్న అక్కసును పవన్ కళ్యాణ్ వెళ్లగక్కారని మండిపడ్డారు. తెలంగాణకు మద్దతు



గా పవన్ కళ్యాణ్ ఎప్పుడైనా పోరాటం చేశారా అని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రాసిచ్చిన స్క్రిప్ట్‌ను.. పవన్ కళ్యాణ్ చదువుతున్నారని పొన్నం ప్రభాకర్ ఎద్దేవా చేశారు.

**బీఆర్ఎస్ లేదా బీజేపీ ఎవరో ఒకరు ఎంగేజ్ చేసుకున్న ఆర్టిస్ట్**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు విడిపోయినప్పటికీ.. ప్రాంతాలుగా తెలుగు రాష్ట్రాల ప్రజలు కలిసి ఉండాలని తాము కోరుకున్నామని పొన్నం తెలిపారు. తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభతో తెలంగాణలో పవన్ కళ్యాణ్ పీకేది ఏముందని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పవన్ కళ్యాణ్ బీఆర్ఎస్ లేదా బీజేపీ ఎవరో ఒకరు ఎంగేజ్ చేసుకున్న ఆర్టిస్ట్ అని.. అయితే ఆయనకు సరైన స్క్రిప్ట్ ఇవ్వడం లేదని ఎద్దేవా చేశారు. సినిమాల్లో ఆర్టిస్ట్‌ను స్క్రీన్ టెస్ట్ చేసినట్లు తెలంగాణ రాజకీయాల్లో పవన్ కళ్యాణ్‌ను బీజేపీ పార్టీ టెస్ట్ చేస్తున్నారనేది వాస్తవం అని తెలిపారు. ఆంధ్రా ప్రజలను ఎప్పుడూ తెలంగాణ ప్రజలు స్వాగితిస్తున్నారని గుర్తు చేశారు. మనం ప్రజాస్వామ్యంలోనే ఉన్నామని తెలిపారు. ఎప్పుడైనా తెలంగాణకు పవన్ కళ్యాణ్ మద్దతు ఇచ్చారా.. తెలంగాణ అమరవీరులకు ఏరోజైనా అండగా నిలిచారా అని మంత్రి పొన్నం ప్రశ్నించారు.

## పవన్ కు ఫ్యాన్స్ పై ప్రేముంటే ఫ్రీగా టికెట్లు పంచాలి

**హైదరాబాద్, మహా :** పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఫైర్ అయ్యారు. ఏపీ డిప్యూటీ సీఎంగా గెలిచిన తరువాత పవన్ హైదరాబాద్ లో ఎన్నిరోజులు, ఏపీలో ఎన్నిరోజులు ఉన్నాడో చెప్పాలని ప్రశ్నించారు. అమిత్ షాపై ప్రేమ ఉంటే వెళ్లి గుజరాత్ లో పోటీ చేయాలని ఆయన సూచించారు. ఓజీ, ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలు ఫ్లాప్ అయిన ఫ్రస్టేషన్ లో పవన్ మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. పవన్ కళ్యాణ్ కు తన ఫ్యాన్స్ పై అంత ప్రేమ ఉంటే ఉచితంగా టికెట్లు పంచాలని సవాల్ విసిరారు. రాజకీయాల్లోకి వచ్చాకే పవన్ బాగుపడ్డారన్నారు. ఎక్కువ ప్యాకేజీ ఇచ్చే ప్రొడ్యూసర్ల దగ్గరకి పవన్ వెళ్తాడని విమర్శించారు. ఏపీకి జగన్ సీఎంగా ఉన్నప్పుడు పవన్ హైదరాబాద్ లో తలదాచుకున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు.



# తెలంగాణ మీ అయ్య జాగీరా?

**హైదరాబాద్, మహా :** "నాకు ఆంధ్రప్రదేశ్‌లోనే ముఖ్యమంత్రి అయ్యే దిక్కు లేదు, ఇక తెలంగాణలో ఎందుకు అవుతాను?" అంటూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ తనపై వస్తున్న విమర్శలకు బదులిచ్చారు. తెలంగాణలో రాజకీయ లబ్ధి కోసమే తాను ప్రయత్నిస్తున్నానంటూ కొందరు చేస్తున్న ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు.. తెలంగాణ మీ అయ్య జాగీరా? నన్ను రావొద్దనడానికి మీరెవరు? అంటూ ఫైర్ అయ్యారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పవన్ మాట్లాడుతూ, తనను, జనసేనను లక్ష్యంగా చేసుకుని కొందరు పనిగట్టుకుని ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతున్నారని అన్నారు. "భారత రాష్ట్ర సమితిని కేసీఆర్ గారు ఆంధ్రాలో ప్రారంభించినప్పుడు, నేను మనస్ఫూర్తిగా స్వాగతించాను. ఒక రాజకీయ పార్టీని దేశంలో ఎక్కడైనా పెట్టుకోవచ్చు. గుంటూరులో బీఆర్ఎస్ కార్యాలయం పెట్టి, జనసేనలో పనిచేసిన నాయకుడిని అధ్యక్షుడిగా నియమించినా నేను ఆహ్వానించాను. అలాంటప్పుడు, జనసేన తెలంగాణలో అడుగుపెట్టకూడదు అనడం ఎంతవరకు సబబు? మేమేమైనా తెలంగాణలో పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి అవుతాడని అడుగుతున్నామా? ఆంధ్రాలోనే దిక్కులేని నాకు ఇక్కడ ఆశ ఎందుకు ఉంటుంది? నిజానికి వాళ్లకున్న భయమల్లా ఒక్కటే. జనసేన వస్తే ప్రజలను చైతన్యవంతుల్ని చేస్తుందనే భయం. సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తుందనే భయం. కేవలం 2000 మందితో సభ పెట్టుకుంటామంటే కూడా పర్మిషన్ ఇవ్వకపోతే మేం ఏం చేయాలి? దుర్మార్గా



లు చేయమంటారా? నేను అమిత్ షా గారి గురించి మాట్లాడితే, దానికి ప్రాంతీయత, కులం రంగులు పులిమి నన్ను అవమానిస్తారా? మీ ఇష్టానికి మీరు మాట్లాడితే, కనీసం బాధపడే హక్కు కూడా మాకు లేదా? మేం ఇంకా "బాంచన్ దొర, నీ కాళ్లు మొక్కుతా" అని బతకాలా? పీకలు కోసుకుంటాం కానీ అలాంటి భయంతో బతకలేం. తెలంగాణలో ఆంధ్ర కాంట్రాక్టర్లు, ఆంధ్రాలో తెలంగాణ కాంట్రాక్టర్లు బాగున్నారు. వాళ్ల వ్యాపారాలు, అధికారాలు అన్నీ బాగున్నాయి. మధ్యలో నాలాంటి వాడిని మాట్లాడనివ్వకుండా చేసి, ప్రజలను బేవకూఫ్‌లను చేస్తున్నారు. ఇది తెలంగాణ ప్రజలు గమనించాలి. నిజంగా నేను తెలంగాణకు రావొద్దని మీరు అనుకుంటే, అసెంబ్లీలో తీర్మానం పెట్టండి. పవన్ కళ్యాణ్ ఇక్కడ అడుగుపెట్టకూడదని తీర్మానం చేయండి. ఎలా చేస్తారో నేను కూడా చూస్తా. తెలంగాణ ఉద్యమంలో 1200 మందికి పైగా యువత ప్రాణాలు అర్పించారు. వాళ్లంటే నాకు ఎంతో గౌరవం. తెలంగాణ అంటే నాకు ప్రాణం. కానీ మీరు నా ప్రేమనే శంకిస్తున్నారు. అందుకే, ఇప్పటిదాకా తీసుకోని నిర్ణయం ఇప్పుడు తీసుకుంటున్నా. తెలంగాణలో జనసేన ఉంటుంది. మేం పోటీ చేస్తాం. నేనే స్వయంగా తిరుగుతా. ప్రతి సమస్యపై మాట్లాడుతాం. ప్రతి అన్యాయాన్ని ఎదుర్కొంటాం. తెలంగాణ భారతదేశంలో అంతర్భాగం అని మర్చిపోకండి. బెదిరిస్తే భయపడటానికి మేం సిద్ధంగా లేము. దశాబ్దాలుగా భరించాం, ఇక చరమగీతం పాడతాం. విచిత్రం ఏంటంటే, ఒకప్పుడు తెలంగాణను వ్యతిరేకించిన వాళ్లే ఈరోజు అక్కడ పదవుల్లో కూర్చున్నారు" అని ఘాటుగా విమర్శించారు. తెలంగాణ ఉద్యమం ఊపందుకోక ముందు నుంచే తనకు ఇక్కడి సంస్కృతి, పోరాట స్ఫూర్తి అంటే ఎంతో ఇష్టమని, దానిని తన సినిమాల్లోనూ చూపించానని గుర్తుచేశారు. కొందరు నాయకులు తనను భౌతికంగా అడ్డుకుంటామని, దాడులు చేస్తామని బెదిరిస్తున్నారని, అలాంటి బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని పవన్ హెచ్చరించారు. చావుకు సిద్ధపడే పార్టీ పెట్టానని అన్నారు.
ప్రాంతీయ విద్వేషాలు దేశ సమగ్రతకు ఉగ్రవాదం కంటే ప్రమాదకరమని పవన్ ఆందోళన వ్యక్తం చేశారు. "ఉపాధి లేకపోతే, పరిశ్రమలు రాకపోతే దానికి ఆంధ్రోళ్లే కారణం అన్నట్టు మాట్లాడటం సరికాదు. నాయకుల మధ్య ఉండే విభేదాలను ప్రజలకు అంటించవద్దు" అని కోరారు.


# సిద్ధిపేట వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

( మొదటి పేజీ తరువాయి )
నుండి సిద్దిపేటకు బయలుదేరారు. మార్గమధ్యంలో, సిద్దిపేట సమీపంలో వారి కారు ప్రమాదానికి గురైంది. ఈ దుర్ఘటనలో రవి, సునీత దంపతులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, కుమారుడు, కోడలు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

**ఆగి ఉన్న లారీని**
సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామం వద్ద సిద్దిపేట - వరంగల్ ప్రధాన రహదారిపై జరిగిన ఒక ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వేగంగా దూసుకొచ్చిన ఒక కారు, రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక భాగం నుండి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు కారు లారీ కిందకు దూసుకుపోయి పూర్తిగా నలిగిపోయింది. కారులో ప్రయాణిస్తున్న రవి, సునీత అనే దంపతులు తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే కారు లారీ కింద ఇరుక్కుపోవడంతో, మృతదేహాలను, క్షతగాత్రులను బయటకు తీయడానికి పోలీసులకు, స్థానికులకు దాదాపు అరగంటకు పైగా సమయం పట్టింది.

**మణుగూరుతో అనుబంధం**
ారవి దంపతులు సుదీర్ఘ కాలం పాటు మణుగూరు, బందారు గూడెం, భద్రాచలం ప్రాంతాల్లో 'రవి గ్రాఫిక్స్' పేరిట సేవలందించారు. గ్రాఫిక్స్ రంగంలో వారికి మంచి పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. కొంతకాలం క్రితం సిద్దిపేటలో స్థిరపడి అక్కడ కూడా తమ సేవలను కొనసాగిస్తూ ప్రజల మన్ననలు పొందారు.

**తిరుగు ప్రయాణంలో విషాదం:**
రవి తన అన్న, లక్ష్మి గ్రాఫిక్స్ అధినేత ప్రభాకర్ ఇంటికి వెళ్లి తిరిగి సిద్దిపేటకు వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. అకాల మరణం చెందిన రవి దంపతుల మృతి వార్త తెలుసుకున్న మణుగూరు పట్టణ ప్రజలు, వ్యాపారస్తులు, పుర ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. రవి, సునీత దంపతుల మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, గాయపడిన కుమారుడు, కోడలు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. అలాగే, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు



# పవన్ పాకిస్తాన్ లో ఉండాల్సిన వ్యక్తి

**నల్లగొండ, మహా :** తెలంగాణలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రెస్‌మీట్, సభకు అనుమతి నిరాకరణ వ్యవహారాలపై బీఆర్ఎస్ ముఖ్య నేత, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ఘాటుగా స్పందించారు. పవన్ అసలు పాకిస్తాన్ లో ఉండాల్సిన వ్యక్తి అంటూ జగదీశ్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం కాంగ్రెస్, పవన్ కళ్యాణ్ కలిసి ఓ పెద్ద డ్రామా నడుపుతున్నారని ఆయన ఆరోపించారు. మంగళవారం జగదీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ సభకు ఆంక్షలు పెట్టడం వెనుక కాంగ్రెస్, జనసేనల మధ్య ఉన్న 'మ్యాచ్ ఫిక్సింగ్' స్పష్టంగా అర్థమవుతోందని సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో నెలకొన్న అసలైన ప్రజా సమస్యలను, ప్రభుత్వ వైఫల్యాలను పక్కదారి పట్టించేందుకే ఈ హైడ్రామాకు తెర లేపారని మండిపడ్డారు. పవన్ మాటల్లో ఎక్కడా స్పష్టత లేదని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ స్క్రిప్ట్ రాసిస్తే.. పవన్ కళ్యాణ్ ఇక్కడ వచ్చి చదివారంటూ ఎద్దేవా చేశారు.

**అనుమతి నిరాకరణతో పొలిటికల్ స్టంట్ ఏంటి?**

రాష్ట్రంలో గతంలో అనేక పార్టీలు స్వేచ్ఛగా పోటీ చేశాయని గుర్తుచేసిన జగదీశ్ రెడ్డి.. పవన్ కళ్యాణ్ సభకు ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోతే చట్టబద్ధంగా కోర్టుకు వెళ్లి పర్మిషన్ తెచ్చుకోవాలి కానీ, ఇలా రాజకీయ రచ్చ చేయడం ఏంటని ప్రశ్నించారు. అనుమతి నిరాకరణను ఓ పొలిటికల్ స్టంట్‌లా వాడుకుంటున్నారని జగదీశ్ రెడ్డి దుయ్యబట్టారు. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ అనే పదాన్ని పలికేందుకు కూడా ఇష్టం లేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఆ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే ఈ కొత్త పవన్ కళ్యాణ్ వివాదాన్ని వాడుకుంటున్నారని జగదీష్ రెడ్డి స్పష్టం చేశారు.

# తెలంగాణలో అధికారంలోకి వస్తాం

**బిజెపి అధ్యక్షుడు నితిన్ నబీన్**

ఢిల్లీ, మహా: వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ కచ్చితంగా అధికారంలోకి వస్తుందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు రానున్న ఎన్నికల్లో బీజేపీకి సంపూర్ణ మద్దతు అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లోని అంబేద్కర్ ఆడిటోరియంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. తెలంగాణ రెసిడెంట్స్ ఆఫ్ ఢిల్లీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నితిన్ నబీన్ మాట్లాడుతూ, చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు బీజేపీ ఎప్పటి నుంచో మద్దతుదారుగా ఉందన్నారు.

మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి నాయకత్వంలో ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు ఏర్పాటయ్యాయని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో మాజీ కేంద్ర మంత్రి సుష్మా స్వరాజ్ పార్లమెంట్‌లో అందించిన సంపూర్ణ మద్దతు చారిత్రాత్మకమని పేర్కొన్నారు. తెలంగాణ కోసం ఎన్నో పోరాటాలు చేసి రాష్ట్రాన్ని సాధించుకున్నారని, ఆ పోరాటంలో అసువులు బాసిన అమరవీరులకు శిరస్సు వంచి నమస్కారం చేస్తున్నాను. వారు కలలు కన్న తెలంగాణను నిర్మించుకోవడంలో ప్రస్తుతం కాస్త వెనుకబడ్డామని, భవిష్యత్తులో తెలంగాణ అభివృద్ధి కోసం, అమరవీరులు కలలు కన్న తెలంగాణను నిర్మించుకునేందుకు బీజేపీ పోరాటం చేస్తుందన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి ఢిల్లీలో ప్రెస్‌మీట్లు పెట్టలేడా?

**ఎంపీ రఘునందన్ కౌంటర్**

హైదరాబాద్, మహా : ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం తెలంగాణలో ప్రెస్‌మీట్ పెడితే.. కాంగ్రెస్ నేతలకు, సీఎం రేవంత్ రెడ్డి కి వచ్చిన అభ్యంతరం ఏంటో చెప్పాలని బీజేపీ రఘునందన్ సూటిగా ప్రశ్నించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రెండున్నరేళ్లుగా తెలంగాణ సీఎంగా వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డి వందలసార్లు ఢిల్లీకి వెళ్లారని, అక్కడ ప్రెస్‌మీట్ పెట్టడం లేదా అని అన్నారు. అలా అయితే, ఇక్కడ పక్క రాష్ట్రం వాళ్లు ఇక్కడ ప్రెస్‌మీట్‌లు పెట్టొద్దా? అని సెటైర్లు వేశారు. గతంలో కేసీఆర్ కూడా పక్క రాష్ట్రం ఏపీలో సభలు పెట్టారని.. నేడు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లో హైదరాబాద్ లో సభ పెడితే కాంగ్రెస్ నేతలు ఎందుకు ఉలిక్కిపడుతున్నారని ఫైర్ అయ్యారు.

# కుర్చీకి 'నో'.. చాపకు 'ఎస్'...

- ఆసిఫాబాద్‌లో సీఎం రేవంత్ సరికొత్త 'విజువల్ పాలిటిక్స్'!
- దగ్గరగా అంటే...నిజంగానే దగ్గరగా.
- నెట్టింట హోరెత్తిన మీమ్స్ జాతర.



**ఆసిఫాబాద్,మహా :** రాజకీయాల్లో ఏ చిన్న అడుగు వేసినా దాని వెనుక ఓ పెద్ద వ్యూహం ఉంటుంది. నాయకులు వేదికలెక్కి చేసే ప్రసంగాల కంటే, వారు చేసే చిన్న చిన్న చేతలే జనాల్లోకి బలంగా వెళ్తుంటాయి. సరిగ్గా ఇలాంటి ఘటనే ఆసిఫాబాద్‌లో జరిగిన ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత ప్రారంభోత్సవ సభలో చోటుచేసుకుంది. అధికారులందరూ ప్రొటోకాల్ ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోసం అత్యంత శ్రద్ధగా ఒక ప్రత్యేకమైన కుర్చీని సిద్ధం చేశారు. కానీ, సీఎం మాత్రం ఆ అధికారిక కుర్చీకి సున్నితంగా 'నో థాంక్యూ' చెప్పేసి, నేరుగా వెళ్లి మహిళల మధ్య చాపపై కూర్చున్నారు. దీంతో వేదికపై ఠీవిగా ఉన్న కుర్చీలన్నీ ఒక్కసారిగా తమ ఉనికిని కోల్పోయి.. తమ భవిష్యత్తు ఏంటా అని ఆలోచనలో పడిపోయినట్లుగా అక్కడి వాతావరణం మారిపోయింది! ఈ సరికొత్త 'విజువల్ పాలిటిక్స్' ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.

**దగ్గరగా అంటే...నిజంగానే దగ్గరగా**

సాధారణంగా రాజకీయ నాయకులు ప్రజలకు తాము ఎంతో దగ్గరగా ఉన్నామని చెప్పేందుకు సభల్లో భారీ వేదికలెక్కి చేతులు ఊపుతారు.. మైకుల్లో హామీల వర్షం కురిపిస్తారు. కానీ, రేవంత్ రెడ్డి మాత్రం ఈసారి అందరికంటే ఒక అడుగు ముందుకేశారు. "ప్రజలకు దగ్గరగా ఉండటం అంటే కేవలం మాటల్లో కాదు... చేతల్లో చూపించాలి" అన్నట్లుగా మహిళల పక్కనే నేల మీద కూర్చుని ముచ్చటించారు. ముఖ్యమంత్రి హఠాత్తుగా కింద కూర్చోవడంతో అంతవరకు ప్రొటోకాల్స్, కుర్చీల అమరిక కోసం తెగ శ్రమించిన అధికారులు ఒక్కసారిగా అయోమయంలో పడిపోయారు. తాము పడిన శ్రమ అంతా వృథా అయిందేమోనని వారు తలలు పట్టుకున్న దృశ్యం అక్కడున్న వారిని నవ్వించింది.

**నెట్టింట హోరెత్తిన మీమ్స్ జాతర**

ముఖ్యమంత్రి నేలపై కూర్చున్న దృశ్యాన్ని చూసిన సోషల్ మీడియా సైన్యం ఊరుకుంటుందా? వెంటనే రంగంలోకి దిగి తమ క్రియేటివిటీకి పదును పెట్టింది. క్షణాల్లోనే మీమ్స్ వెల్లువెత్తాయి. కొందరు నెటిజన్లు "కుర్చీ కోసం రాజకీయాలు చేసే రోజులు పోయాయి... ఇప్పుడు కుర్చీని వదిలి రాజకీయాలు చేసే రోజులు వచ్చాయి" అంటూ పోస్టులు పెడుతుంటే... మరికొందరు ఏకంగా "కుర్చీలో కూర్చుంటే సీఎం... కింద కూర్చుంటే కామన్ మ్యాన్ సీఎం" అంటూ సరికొత్త రాజకీయ సిద్ధాంతాలనే తెరపైకి తెచ్చారు. ఈ వినూత్న కామెంట్లతో సదరు ఫోటోలు, వీడియోలు ఇంటర్నెట్‌లో విపరీతంగా వైరల్ అయ్యాయి.

**వ్యూహమా? పబ్లిసిటీ స్టంటా?.. ప్రతిపక్షాల సెటైర్లు**

రాజకీయాల్లో ఏదీ యాదృచ్ఛికంగా జరగదని, ప్రతి అడుగు వెనుకా ఒక స్పష్టమైన వ్యూహం ఉంటుందని విశ్లేషకులు అంటుంటారు. ప్రతిపక్షాలైతే సీఎం చర్యను పక్కా పొలిటికల్ స్ట్రాటజీగా అభివర్ణిస్తున్నాయి. ఎన్నికలు, రాజకీయ ప్రయోజనాలు దగ్గర పడినప్పుడు నాయకులు ప్రజల మధ్య కూర్చోవడం, పిల్లలను ఎత్తుకుని ముద్దాడటం, సాధారణ హోటళ్లలో టీ తాగడం, పొలం దున్నడం వంటివి రాజకీయాల్లో ఎప్పట్నుంచో వస్తున్న 'సంప్రదాయ' కార్యక్రమాల్లో భాగమేనని సెటైర్లు పేలుస్తున్నాయి. "ఇంకొన్ని రోజులు ఆగితే బహుశా అధికారులు సీఎం కోసం ఎంత ఖరీదైన సోఫా వేసినా.. ఆయన మాత్రం చాప మీదే కూర్చుంటారేమో!" అంటూ వ్యంగ్య బాణాలు విసురుతున్నాయి.

**అధికారులకు మొదలైన మిలియన్ డాలర్ల టెన్షన్!**

ఏది ఏమైనా ఆసిఫాబాద్ సభలో ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం కంటే... సీఎం రేవంత్ రెడ్డి కూర్చున్న స్థలమే ప్రధాన ఆకర్షణగా మారిపోయింది. దశాబ్దాలుగా రాజకీయాల్లో కుర్చీ కోసం జరిగే కురుక్షేత్రాలను చూసిన జనాలకి.. ఆ కుర్చీనే పక్కనపెట్టి నేలపై కూర్చున్న సీఎం ఒక కొత్త పాఠం నేర్పారనే చెప్పాలి.

అయితే, ఈ సంఘటన తర్వాత అధికారులకు ఒక సరికొత్త తలనొప్పి మొదలైంది. ఇకపై జరగబోయే ముఖ్యమంత్రి సభలకు ఎలాంటి ఏర్పాట్లు చేయాలన్నదే వారి ఇపుడు వారి ప్రధాన సమస్య. "ప్రొటోకాల్ ప్రకారం వీఐపీ కుర్చీలు వేయాలా? లేక ముందుగానే అంచనా వేసి మంచి చాపలు, పరుపులు ఆర్డర్ ఇచ్చి కింద పరచాలా?" అన్నది సచివాలయ వర్గాల్లో నడుస్తున్న అతి పెద్ద మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది!

# తెలంగాణపై పవన్ విద్వేష విషం

**(హైదరాబాద్ మహా):** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు జనసేనాని పవన్ కల్యాణ్ చెప్పినట్లుగానే తెలంగాణ ఆస్తిత్వంపై దాడిచేశారు. ఆంధ్రానాయకులు 60 ఏండ్లు పరిపాలన చేసి తమను దోపిడీచేశారనే తెలంగాణ ప్రాంత ప్రజలు ఐక్యంగా ఉద్యమించి, బలిదానాలతో రాష్ట్రం తెచ్చుకోగా సందర్భం వచ్చినపుడల్లా తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడి తెలంగాణను నవనిర్మాణం చేస్తానంటూ పవన్ పూర్తిగా ఈ ప్రాంత భావోద్వేగాలను రెచ్చగొట్టేలా ప్రెస్ మీట్ పెట్టడంపై రాజకీయపక్షాలు మండిపడుతున్నాయి. నరేంద్ర మోదీ వ్యూహంలో భాగంగానే పవన్ తెలంగాణ ఆవిర్భావం రోజు రెచ్చగొట్టాడని, ఇది బిజెపికి రానున్న రోజుల్లో గ్రేటర్ హైదరాబాద్ తో పాటు తెలంగాణలో నష్టం చేస్తుందన్న అభిప్రాయం ఆ పార్టీనేతల్లో వ్యక్తమవుతోంది. పవన్ తీరుపై బిజెపి రాష్ట్ర చీఫ్ తో పాటు కీలకనేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ కేంద్రహోంమంత్రి అమిత్ షా కు ఫిర్యాదుచేయాలని నిర్ణయించినట్లు సమాచారం. తెలంగాణ లో రాజకీయం చేయడానికి ఇక్కడ మాకు రేవంత్ రెడ్డి, కేసీఆర్, కేటీఆర్, హరీష్, కిషన్ రెడ్డి, బండిసంజయ్, రామచందర్ రావు, అసదుద్దీన్, కూనంనేని, కల్వకుంట్ల కవిత, తీన్మార్ మల్లన్న ఇలా అనేకపార్టీలు, అనేకమంది నేతలు ఉన్నారని, తెలంగాణ రాష్ట్రాన్ని అరవై ఏళ్ళపాటు దోపిడీచేసిన ఆంధ్రాప్రాంతానికి చెందిన ఉపముఖ్యమంత్రి వచ్చి ఇక్కడ నవ నిర్మాణం చేయాల్సిన అవసరం లేదంటూ తెలంగాణవాదులు భగ్గుమంటున్నారు. సామాజిక మాధ్యమాల్లో అనేక పోస్టులు పెట్టడంతో పాటు నిరసనలకు పూనుకుంటున్నారు. గతంలో కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో ఎలాంటి సందర్భం ఉన్నా తెలంగాణ అస్తిత్వం విషయానికొచ్చేసరికి, ఎవరినైనా అనుమతించకపోయేవారని, పవన్ కల్యాణ్ తీరు బిజెపితో పాటు అధికార కాంగ్రెస్ కు కూడా ఇబ్బందికరమన్న వాదన ఉంది. తెలంగాణ భావోద్వేగాలను పవన్ తట్టిలేపగా, అన్ని రాజకీయపార్టీలలో ఉన్న తెలంగాణవాదులు పవన్ తీరును వ్యతిరేకిస్తున్నారు. జనసేన స్థానిక ఎన్నికల్లో పోటీచేస్తే ఎవరూ అభ్యంతరపెట్టలేదు.. కానీ తెలంగాణ ఆవిర్భావం రోజు తెలంగాణ నేతలను, ప్రజలను అవమానించేలా నవనిర్మాణసభకు పూనుకోవడం ఆగ్రహానికి కారణమైంది. కోర్టు అనుమతి నిరాకరించినా తెలంగాణ చైతన్యాన్ని పరిహాసం చేసిన పవన్ కల్యాణ్ రానున్న రోజుల్లో పర్యవసానాలకు సిద్ధపడాలని తెలంగాణ వాదులు హెచ్చరిస్తున్నారు. కాగా పవన్ దూకుడు బీజేపీతో పాటు అధికార కాంగ్రెస్ కు నష్టం కలిగించే అవకాశం ఉం

# చల్లని కబురు

- రెండో వారంలో తెలంగాణలోకి నైరుతి రుతుపవనాలు
- మూడు రోజులు వర్షా లు, తగ్గనున్న ఉష్ణోగ్రతలు
- రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్న ఐఎండీ



**హైదరాబాద్, మహా :** తెలంగాణలో ఎండల తీవ్రతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు వాతావరణ శాఖ అత్యంత తీపి కబురు అందించింది. గత కొన్ని రోజులుగా రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలతో భానుడు సృష్టిస్తున్న భీభత్సానికి త్వరలోనే బ్రేక్ పడనుంది. గురువారం నాటికి నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకడానికి పూర్తి అనుకూల పరిస్థితులు ఉన్నాయని భారత వాతావరణ కేంద్రం అంచనా వేసింది. రుతుపవనాల రాకతో పాటు రాష్ట్రంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం, ద్రోణుల ప్రభావంతో రాబోయే మూడు రోజుల పాటు తెలంగాణ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.వాతావరణ శాఖ తాజా బులెటిన్ ప్రకారం, నైరుతి రుతుపవనాల గమనం ఆశాజనకంగా ఉంది. ఇవి గురువారం నాటికి కేరళలో ప్రవేశిస్తే, అక్కడ నుంచి వారం రోజులలోపు, అంటే జూన్ రెండో వారంలోగా ఇవి తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉంది. రుతుపవనాల రాక కంటే ముందే రాష్ట్రంలో ముందస్తు వర్షాలు ఊపందుకోనున్నాయి. దీనివల్ల రాబోయే నాలుగు రోజుల్లో రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా 2 నుండి 4 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గే అవకాశం ఉంది. ఫలితంగా వేడి గాలుల తీవ్రత తగ్గి వాతావరణం చల్లబడనుంది. బుధ, గురు, శుక్రవారాల్లో తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. వర్షంతో పాటు గంటకు 50 నుండి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే సూచనలు ఉన్నాయని వాతావరణ కేంద్రం హెచ్చరించింది.బుధవారం ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కొన్ని జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల వర్షాలు పడనున్నాయి. మరోవైపు మధ్య, దక్షిణ తెలంగాణలోని పలు జిల్లాల్లో పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున ఎల్లో అలర్ట్ ప్రకటించారు. ఉమ్మడి నల్గొండ, వరంగల్, మెదక్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, కామారెడ్డి జిల్లాలకు ఈ మేరకు హెచ్చరిక జారీ చేశారు. వాతావరణంలో వస్తున్న ఈ మార్పుల నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు, రైతులు, పశువుల కాపరులు చెట్ల కింద నిలబడకూడదు. సురక్షితమైన భవనాల్లో ఆశ్రయం పొందాలి. గంటకు 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ప్రమాదం ఉన్నందున పాత ఇళ్లు, తాత్కాలిక షెడ్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగుల దగ్గర ఉండకూడదు. ఖరీఫ్ సీజన్ సాగుకు సిద్ధమవుతున్న రైతులు ఈ ముందస్తు వర్షాల ఆధారంగా భూమిని సిద్ధం చేసుకోవచ్చు. అయితే కోసి ఆరబోసిన పంటలు ఉంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్ నగరంలో కూడా ఆకాశం సాధారణంగా మేఘావృతమై ఉంటుందని ఐఎండి తెలిపింది.

# గండిపేట ఫేక్ జీవో కేసు

- మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు ఇంట్లో తనిఖీలు
- రూ. 1500 కోట్ల భూ కబ్జా కేసులో ఆరోపణలు

**అమరావతి, మహా :** ఫేక్ జీవోలు సృష్టించి హైదరాబాద్‌లో ఏకంగా రూ.1500 కోట్ల భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించిన కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడుకు ఉచ్చు బిగుస్తోంది. ఇప్పటికే కేసు నమోదు చేసి పలువురిని అరెస్ట్ చేసిన తెలంగాణ పోలీసులు.. తాజాగా ఏపీలోని ఆయన నివాసంలో తనిఖీలు నిర్వహించారు. ఇక ఈ బాగోతం బయటికి వచ్చినప్పటి నుంచి బ్రహ్మనాయుడు పరారీలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు ఆయన కోసం గాలింపు చేపట్టారు. గండిపేటలో వందల కోట్ల విలువైన భూములను కాజేసేందుకు.. ఫేక్ జీవోలను సృష్టించిన కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రస్తుతం పరారీలో ఉండగా అతడిని పట్టుకునేందుకు తెలంగాణ పోలీసులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ కేసులో మరిన్ని ఆధారాల కోసం తాజాగా సైబరాబాద్ పోలీసులు ఏపీకి చేరుకున్నారు. ఈ కేసు వెలుగులోకి వచ్చిన తర్వాత వైసీపీ మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు పరారయ్యారని పోలీసులు వెల్లడించారు. గండిపేట ప్రాంతంలో దాదాపు రూ.1500 కోట్ల భూమికి సంబంధించి నకిలీ జీవోలను తయారు చేసిన కేసులో సైబరాబాద్ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఆంధ్రప్రదేశ్ నరసరావుపేటలో బొల్ల బ్రహ్మనాయుడు ఇంట్లో సైబరాబాద్ పోలీసులు సోదాలు నిర్వహించారు. బ్రహ్మనాయుడు, ఆయన టీం కేరళ, కర్ణాటకలో తిరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే 4 స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేశామని వారి కోసం గాలింపు చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

అక్రమంగా జీవోలను సృష్టించి.. రూ.1500 కోట్ల విలువైన భూమిని కాజేసే కుట్రలో బ్రహ్మనాయుడు ప్రధాన పాత్ర పోషించినట్లు పోలీసులు గుర్తించారు. ఆ విలువైన భూమిని కబ్జా చేసిన బ్రహ్మనాయుడు అండ్ టీం వెంటనే దాన్ని ఇతరులకు అమ్మేసేందుకు ప్రయత్నాలు చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఆ నకిలీ జీవోలను బ్రహ్మనాయుడు అండ్ గ్యాంగ్ సోషల్ మీడియాలో వైరల్ చేశారని పోలీసులు తెలిపారు. అయితే నెట్టింట వైరల్ అవుతున్న నకిలీ జీవోలతో రంగంలోకి దిగిన సైబర్ క్రైమ్ పోలీసులు.. బ్రహ్మనాయుడు అండ్ గ్యాంగ్‌పై నిఘా పెట్టి.. వారిలో కొందర్ని అరెస్ట్ చేశారు. వైసీపీ నేతలు బ్రహ్మనాయుడు, రాధాకృష్ణ కలిసి మరిన్ని జీవోలు తయారు చేసినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసులో మొత్తం 10 మంది నిందితులు ఉండగా.. అందులో ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. మరో ఐదుగురి కోసం గాలింపు చేపట్టామని పోలీసులు వెల్లడించారు. ఈ ఫేక్ జీవో కేసులో కడప జిల్లాకు చెందిన మరో వైసీపీ నేత ప్రమేయం కూడా ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసులో కీలక నిందితుడిగా ఉన్న రాధాకృష్ణపై ఇప్పటికే 9 కేసులు ఉన్నాయని తెలిపారు. ఈ కేసులో అరెస్ట్ అయిన నిందితులను కస్టడీకి తీసుకొని విచారణ జరుపుతామని పోలీసులు పేర్కొన్నారు

# ఏపీలో తెలంగాణ పోలీసుల సోదాలు

- నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే ఇంట్లో విస్తృత తనిఖీలు
- రూ. 1500 కోట్ల భూ కబ్జా కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ నేత
- ఫేక్ జీవోలు సృష్టించి భూ కబ్జాకు పాల్పడ్డారని ఆరోపణ




**అమరావతి, మహా :** ఫేక్ జీవోలు సృష్టించి హైదరాబాద్‌లో ఏకంగా రూ.1500 కోట్ల భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించిన కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడుకు ఉచ్చు బిగుస్తోంది. ఇప్పటికే కేసు నమోదు చేసి పలువురిని అరెస్ట్ చేసిన తెలంగాణ పోలీసులు.. తాజాగా ఏపీలోని ఆయన నివాసంలో తనిఖీలు నిర్వహించారు. ఇక ఈ బాగోతం బయటికి వచ్చినప్పటి నుంచి బ్రహ్మనాయుడు పరారీలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు ఆయన కోసం గాలింపు చేపట్టారు. గండిపేటలో వందల కోట్ల విలువైన భూములను కాజేసేందుకు.. ఫేక్ జీవోలను సృష్టించిన కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రస్తుతం పరారీలో ఉండగా అతడిని పట్టుకునేందుకు తెలంగాణ పోలీసులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ కేసులో మరిన్ని ఆధారాల కోసం తాజాగా సైబరాబాద్ పోలీసులు ఏపీకి చేరుకున్నారు. ఈ కేసు వెలుగులోకి వచ్చిన తర్వాత వైసీపీ మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు పరారయ్యారని పోలీసులు వెల్లడించారు. గండిపేట ప్రాంతంలో దాదాపు రూ.1500 కోట్ల భూమికి సంబంధించి నకిలీ జీవోలను తయారు చేసిన కేసులో సైబరాబాద్ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఆంధ్రప్రదేశ్ నరసరావుపేటలో బొల్ల బ్రహ్మనాయుడు ఇంట్లో సైబరాబాద్ పోలీసులు సోదాలు నిర్వహించారు. బ్రహ్మనాయుడు, ఆయన టీం కేరళ, కర్ణాటకలో తిరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే 4 స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేశామని వారి కోసం గాలింపు చేస్తున్నట్లు స్పష్టం చేశారు.అక్రమంగా జీవోలను సృష్టించి.. రూ.1500 కోట్ల విలువైన భూమిని కాజేసే కుట్రలో బ్రహ్మనాయుడు ప్రధాన పాత్ర పోషించినట్లు పోలీసులు గుర్తించారు. ఆ విలువైన భూమిని కబ్జా చేసిన బ్రహ్మనాయుడు అండ్ టీం వెంటనే దాన్ని ఇతరులకు అమ్మేసేందుకు ప్రయత్నాలు చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఆ నకిలీ జీవోలను బ్రహ్మనాయుడు అండ్ గ్యాంగ్ సోషల్ మీడియాలో వైరల్ చేశారని పోలీసులు తెలిపారు. అయితే నెట్టింట వైరల్ అవుతున్న నకిలీ జీవోలతో రంగంలోకి దిగిన సైబర్ క్రైమ్ పోలీసులు.. బ్రహ్మనాయుడు అండ్ గ్యాంగ్‌పై నిఘా పెట్టి.. వారిలో కొందర్ని అరెస్ట్ చేశారు.

వైసీపీ నేతలు బ్రహ్మనాయుడు, రాధాకృష్ణ కలిసి మరిన్ని జీవోలు తయారు చేసినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసులో మొత్తం 10 మంది నిందితులు ఉండగా.. అందులో ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. మరో ఐదుగురి కోసం గాలింపు చేపట్టామని పోలీసులు వెల్లడించారు. ఈ ఫేక్ జీవో కేసులో కడప జిల్లాకు చెందిన మరో వైసీపీ నేత ప్రమేయం కూడా ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసులో కీలక నిందితుడిగా ఉన్న రాధాకృష్ణపై ఇప్పటికే 9 కేసులు ఉన్నాయని తెలిపారు.

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా

- 91 మంది ఖైదీలకు విముక్తి
- జీవిత ఖైదీలు నేరాలను వదిలి కొత్త జీవితంలో అడుగు పెట్టండి
- తెలంగాణ జైల శాఖ డిజి సౌమ్య మిశ్రా పిలుపు

**కుషాయిగూడ, మహా :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం క్షమాభిక్ష మంజూరు చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా వివిధ జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న సత్ప్రవర్తన కలిగిన 91 మంది ఖైదీలను మంగళవారం విడుదల చేశారు. వీరిలో 6 మంది మహిళా ఖైదీలు, 85 మంది పురుష ఖైదీలు ఉన్నారు. చర్లపల్లి కేంద్ర కారాగారంలో జైళ్లశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మార్గదర్శక ఉపాధి కల్పన సభలో ఖైదీల విడుదల కార్యక్రమం జరిగింది. జైళ్లశాఖ డీజీ సౌమ్య మిశ్రా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐజీలు రాజేష్, మురళీబాబు, డీఐజీలు సంపత్, శ్రీనివాస్, సూపరింటెండెంట్లు ప్రమోద్, శివకుమార్ గౌడ్, భరత్ రెడ్డి, కళాసాగర్, సంతోష్ రాయ్, వెంకటలక్ష్మి తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విడుదలైన మహిళా ఖైదీలకు జీవనోపాధి కోసం ఉచితంగా కుట్టు మిషన్లను డీజీ సౌమ్య మిశ్రా పంపిణీ చేశారు. అలాగే పురుష ఖైదీలకు జైళ్లశాఖ నిర్వహిస్తున్న పెట్రోల్ బంకులు, వివిధ పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విడుదలైన ఖైదీలు ఇకపై సత్ప్రవర్తనతో సమాజంలో గౌరవప్రదంగా జీవిస్తూ కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జీవించాలని సౌమ్య మిశ్రా ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విడుదలైన ఖైదీలు, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.



# వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే : ఆవిర్భావ వేడుకల్లో కేటీఆర్

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ కార్యాలయంలో అమరవీరులకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులర్పించారు. ఆపై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పుష్కర తెలంగాణ ఇప్పుడు ముష్కరుల పాలైందని వ్యాఖ్యానించారు. లివింగ్ లెజెండ్ కేసీఆర్ అని అన్నారు. తెలంగాణ వచ్చాక నోరుందని ఎవరికి ఇష్టం వచ్చినట్లు వాళ్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. 'ఎత్తిన జెండా దించనని.. జెండా దించితే రాళ్లతో కొట్టిచంపమని అన్న ఒకే ఒక్క నాయకుడు కేసీఆర్' అని కేటీఆర్ చెప్పుకొచ్చారు. 2028 డిసెంబర్‌లో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. నెత్తురు పారిన చోట సాగు నీళ్లు తీసుకువచ్చింది కేసీఆర్ అని తెలిపారు. లక్షా 65 వేల ఉద్యోగాలు ఇచ్చింది కేసీఆర్ అని.. అల్పకులు ఏది పడితే అది మాట్లాడతారని మండిపడ్డారు. దేశమంతా కాంగ్రెస్‌ను వదిలించుకుందన్నారు. తెలంగాణను కాంగ్రెస్.. కుక్కలు చింపిన విస్తరిలా చేస్తోందని వ్యాఖ్యానించారు. రైతులు.. అధికారుల కాళ్లు పట్టుకునే దుస్థితి వచ్చిందన్నారు. కృష్ణా, గోదావరిని గురువుకు గురుదక్షిణగా రేవంత్ ఇస్తున్నారని ఆరోపించారు. 'రాహుల్ గాంధీ.. అశోక్‌నగర్ వచ్చి చెప్పిన 2 లక్షల ఉద్యోగాలు ఎక్కడ? సెక్యూరిటీ లేకుండా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు బయటికి వస్తారా.? రైతుబంధు లేదు..

కానీ రాహుల్ గాంధీ బంధు టింగ్ టింగ్ అని వెళ్తోంది. తెలంగాణ తల్లి ఒడ్డాణం, కిరీటం ఎత్తుకు పోతున్నారు' అంటూ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# కిక్కుతో ఊగేద్దాం....



ఎండలు మండిపోతున్నాయి... ఎన్ని మంచినీళ్లు తాగినా దాహం తీరటం లేదు. గొంతు తడారి పోతూనే వుంది... కూల్ డ్రింక్స్ ఎన్ని తాగినా దాహర్తి తీరటం లేదు. కొబ్బరి బోండం రేటు చూస్తే ఉసురుమంటోంది...ఒకటి తాగుదాం లే అనుకుంటే అది ఏ పాటికి సరి పోవటం లేదు... ఏం చేద్దాం...?.. ఏం చేద్దాం...? ఇదే ఇప్పుడు జనాలకు వచ్చి పడిన ఇబ్బంది. అయ్యా... ఇదో ఇబ్బందినా... అసలు మీకు ఆలోచన ఉందా...? దాహం వేస్తే ఎన్ని కొబ్బరిబొండాలు, కూల్ డ్రింక్స్ తాగుతారు...? మనుషులన్న తరువాత కొంచెం ఆలోచన చేయాలి కదా... మీ దాహం ఇట్టే తీరి పోతుంది... చల్లని బీర్లు కొట్టేయండి... ఆలోచించినా ఆశా భంగమే కాదు... కిక్కుకు కూడా మీరు దూరం అవుతారు... ఇది ఇప్పుడు తెలంగాణలో భేష్ గా అమలు అవుతోంది... ఎండలు 47 డిగ్రీలు దాటినా మొక్కవోని ధైర్యంతో తెలంగాణ జనాలు తిరిగేస్తున్నారు అంటే అదంతా మద్యం చలువే. ఇక రేట్లు అంటారా... దానిదేముంది... ఉపాయం ఉంటే కిక్కుకు లక్కు తోడు అవుతుంది... పొద్దున్న ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఆరు వరకు మీరు పడుతున్న శ్రమతో, చేస్తున్న కష్టంతో వస్తున్న డబ్బులు ఉండనే వున్నాయి కదా? ఇక ఆలస్యం ఎందుకు? ఎంజాయ్...!

ఇది ఇప్పుడు తెలంగాణలో మద్యం అమ్మకాల పరిస్థితి... దేశంలోనే మద్యం అమ్మకాల్లో తెలంగాణ నెంబర్ వన్ ప్లేస్ ను కొట్టేసింది... బీర్ల అమ్మకాలు రికార్డ్ స్థాయిలో జరుగుతున్నాయి... ఇక మద్యం అమ్మకాలతో సర్కార్ ఖజానా గలగలమంటోంది... ఇంత కన్నా ఏం కావాలి...? రోజంతా పడిన కష్టం మరిచి పోవటమే కాదు.. వేసవి దాహర్తి కూడా ఇట్టే మటుమాయం అవుతుంది. మాములుగానే తెలంగాణలో మద్యం తాగే అలవాటు ఎక్కువ వుంది. ఇక వేసవిలో ఇది తారాస్థాయికి చేరుకుంది... అసలు విషయం ఏమిటంటే బీర్ల వినియోగంలో తెలంగాణ యువతతో ఎవ్వరు పోటీ పడే పరిస్థితి లేదు... 15 సంవత్సరాల నుంచి 26 సంవత్సరాల వయస్సు వున్నా తెలంగాణ యువతలో 43.05 శాతం మంది ఇప్పుడు మద్యం తాగుతున్నారని సర్వేలో తేటతెల్లం అయింది.

జాతీయ కుటుంబ ఆరోగ్య సంస్థ తాజాగా నిర్వహించిన సర్వేలో తెలంగాణలో యువత అధిక శాతం మద్యం వినియోగిస్తున్నట్లు స్పష్టం అయింది. యువతలో రోజు వారి సంపాదన వున్న వారు రోజుకు సగటున రెండు వందల నుంచి మూడు వందల రూపాయలు మద్యం కోసమే ఖర్చు పెడుతున్నారట. ఇక తెలంగాణ గ్రామీణ ప్రాంతంలో 37.09 శాతం మంది యువత నిత్యం మద్యం తాగుతుండగా, నగరాలు, పట్టణాల్లో 58.23 శాతం మంది మద్యం మత్తులో రోజు ఊగుతున్నట్టు సర్వే తేల్చి చెప్పింది. ఇక 26 నుంచి 60 ఏళ్ల వయసు వున్న వారిలో 34.15 శాతం మంది నిత్యం మద్యం మత్తులో మునిగి తేలుతుండగా, 60 సంవత్సరాల వయసు పై బడిన వారిలో 12 శాతం మంది మద్యం పుచ్చుకోనిదే ఉండలేక పోతున్నారని సర్వే చెప్పుకుని వచ్చింది. మద్యం ఆరోగ్యానికి హానికరం... ముఖ్యంగా యువత మద్యం మత్తులో విచక్షణ కోల్పోయి నేరాలకు పాల్పడే పరిస్థితి వుంది. మద్యం వల్ల కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం అవ్వటం అత్యంత సహజం. మద్యం అమ్మకాల వల్ల ప్రభుత్వం ఆదాయం పొందటం సహజం... కానీ ప్రజా పాలనలో ఇది నూటికి నూరు పాళ్ళు అసహజం. రోజంతా కష్టం చేసి వచ్చిన ఆ డబ్బుతో తాగి ఇటు ఇల్లు, అటు వళ్ళు గుల్ల చేసుకునే పరిస్థితిని ప్రజా ప్రభుత్వం చూస్తూ ఊరుకుంటే అది అనర్థ హేతువే అవుతుంది. మద్యం ఆదాయ వనరుగా చూస్తున్న సర్కార్ దాని వినియోగం పైనా నియంత్రణ పెట్టటం అత్యంత అవసరం. జేబులో అయిదు వందల నోటు ఉంటే కాళ్ళు మద్యం షాప్ వైపునే అడుగులు వేస్తున్నాయి అనేది ఇప్పుడు తెలంగాణలో రికార్డ్ స్థాయి మద్యం అమ్మకాలు చెప్పకనే చెబుతున్నాయి. ఊరు, వాడ, గల్లీ, గల్లీలో మద్యం షాపులు జనాలను రారమ్మని పిలుస్తూ ఉంటే, నియంత్రణ లేని జనం వాటి వైపు పరుగులు తీస్తూనే వున్నారు... అర్ధరాత్రి దాటినా సాగే మద్యం అమ్మకాలు, తెల్లవార్లు నడిచే పబ్బులు, ఎక్కడ పడితే అక్కడ దొరికే మద్యం వెరసి తెలంగాణలో మద్యం అమ్మకాలను రికార్డ్ స్థాయికి చేర్చినా ఇది ఓ హెచ్చరిక అనే నిజం దాని వెనుక వుంది అనేది ప్రభుత్వం గుర్తించాలి... ప్రజా పాలనలో ప్రగతి సాధ్యం కావాలి అంటే కిక్కు నుంచి ముందు తెలంగాణ ప్రజలు మేలుకోవాలి... ఇది సత్యం... ఇదే సత్యం...

**( మద్యం ఆరోగ్యానికి హానికరం )**



జె. వెంకటరమణ

# తమిళనాడులో కమల విలాపం



దక్షిణాది రాజకీయ ముఖచిత్రంపై, ముఖ్యంగా ద్రావిడ కోటలో కమల వికాసం కోసం కలలు గన్న ఢిల్లీ పీఠాన్ని ఉలిక్కిపడేలా చేసిన సంచలన పరిణామం ఇది. గత ఐదు దశాబ్దాలుగా పాతుకుపోయిన ద్రావిడ రాజకీయ పార్టీల అవినీతి కోటలపైన సింగంలా గర్జించిన భారతీయ జనతా పార్టీ యువ కిశోరం, మాజీ ఐపీఎస్ అధికారి కె. అన్నామలై తన పదవికి, పార్టీకి రాజీనామా చేసి దేశ రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టించారు. జూన్ 2, 2026 మంగళవారం నాడు దేశ రాజధాని ఢిల్లీ కేంద్రంగా ఈ చారిత్రక రాజకీయ ఘట్టం చోటుచేసుకుంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బి.ఎల్. సంతోష్‌లను కలిసిన అన్నామలై, ఐదు పేజీల సుదీర్ఘమైన రాజీనామా లేఖను సమర్పించి ఢిల్లీ పెద్దల ముఖంపై కొట్టినట్లుగా రాష్ట్రంలో పార్టీ వైఫల్యాలను కుండబద్దలు కొట్టారు. ఆ తర్వాత కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో జరిగిన భేటీలో, జాతీయ స్థాయిలో కీలక పదవి ఇస్తామంటూ బుజ్జగించే ప్రయత్నం చేసినప్పటికీ, తన ఆత్మాభిమానాన్ని చంపుకుని పార్టీలో కొనసాగేది లేదని, తనకంటూ సొంత రాజకీయ మార్గాన్ని నిర్మించుకుంటానని అన్నామలై తెగేసి చెప్పినట్లు రాజకీయ వర్గాల్లో మార్మోగుతోంది. ఇది కేవలం ఒక నాయకుడి రాజీనామా మాత్రమే కాదు, క్షేత్రస్థాయి వాస్తవాలను విస్మరించి, గదిలో కూర్చుని రాజకీయాలు నడిపే జాతీయ పార్టీల అహంకారానికి, ఒక ఆత్మాభిమానం గల ప్రాంతీయ నాయకుడికి మధ్య జరిగిన చారిత్రక సైద్ధాంతిక పోరాటం!

ఈ రాజీనామా వెనుక ఉన్న అగ్నిపర్వతం ఒక్కరోజులో బద్దలైంది కాదు. కర్ణాటక క్యాడర్ ఐపీఎస్ అధికారిగా విధి నిర్వహణలో ప్రదర్శించిన కఠిన వైఖరితో ప్రజలచే "సింగం"గా కీర్తించబడిన అన్నామలై, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వానికి ఆకర్షితులై 2020లో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన ఏడాదికే, 2021లో తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి, "ఎన్ మన్, ఎన్ మక్కల్" (నా భూమి, నా ప్రజలు) పాదయాత్రతో రాష్ట్ర రాజకీయాల్లో ఒక అనూహ్యమైన ప్రభంజనాన్ని సృష్టించారు. ఆ దూకుడుతోనే దశాబ్దాలుగా నోటా కే పరిమితమైన బీజేపీని, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్నడూ లేని విధంగా ఏకంగా 11.4 శాతం ఓటు షేరు సాధించే స్థాయికి తీసుకువెళ్లారు. ఎన్నికల రాజకీయాల్లో అరవకురిచి మరియు కోయంబత్తూరు నుంచి పోటీ చేసి వ్యక్తిగతంగా ఆయన పరాజయాలు మూటగట్టుకున్నప్పటికీ, ద్రావిడ పార్టీలపై ఆయన చేసిన రాజీలేని పోరాటం ఆయనను రాష్ట్రంలో తిరుగులేని మాస్ లీడర్‌గా నిలబెట్టింది. అయితే, తానే రక్తం చిందించి, అహర్నిశలు శ్రమించి నిర్మించిన పార్టీలో తనను ఎలా అణగదొక్కారో చూసి ఆయన గుండె రగిలిపోయింది.

అన్నామలై తిరుగుబాటుకు అసలు బీజం ఢిల్లీ నాయకత్వం తీసుకున్న అనాలోచిత, ఆత్మహత్యాసదృశ్యమైన పొత్తుల నిర్ణయాల్లోనే పడింది. ద్రావిడ పార్టీల అవినీతిపై అలుపెరగని పోరాటం చేసిన ఆయన, ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అన్నాడీఎంకే తో పొత్తు పెట్టుకోకూడదని గట్టిగా వాదించారు. కానీ 2026 అసెంబ్లీ ఎన్నికల కోసం ఢిల్లీ వ్యూహకర్తలు అన్నాడీఎంకే తోక పట్టుకుని ఈదాలనే నిర్ణయానికి వచ్చారు. ఈ క్రమంలో, అన్నాడీఎంకే అధినేత ఎడప్పాడి పలనిస్వామికి అన్నామలై ఒక ముఖ్యమంత్రి అభ్యర్థి స్థాయిలో ప్రత్యక్ష ముప్పుగా మారడంతో, కుల సమీకరణాల ముసుగులో ఏప్రిల్ 2025లో అన్నామలైను అధ్యక్ష పదవి నుంచి అకారణంగా తప్పించారు. కొంగు ప్రాంతానికి చెందిన గౌండర్ సామాజిక వర్గానికి చెందిన అన్నామలై స్థానంలో, తేవర్ సామాజిక వర్గానికి చెందిన అన్నాడీఎంకే మాజీ నేత నైనార్ నాగేంద్రన్‌ను అధ్యక్షుడిగా అధిష్ఠానం నియమించింది. ఒక మాస్ లీడర్‌ను పక్కనపెట్టి, కూటమి ధర్మం పేరుతో తనను బలిపశువును చేయడం ఆయన ఆత్మాభిమానంపై కొట్టిన అతిపెద్ద దెబ్బ.

ఆనాటి నుంచి ఆయనను పార్టీలో ఒక అలంకారప్రాయంగా మార్చే కుట్రలు ముమ్మరమయ్యాయి. 2026 అసెంబ్లీ ఎన్నికల ప్రచార కమిటీల నుంచి పక్కన పెట్టడమే కాకుండా, రాష్ట్రమంతటా ప్రభావం చూపగల నాయకుడిని కేవలం ఆరు నియోజకవర్గాలకు పరిమితం చేయడంతో, అవమాన భారంతో ఆయన ఆ బాధ్యతల నుంచి సైతం తప్పుకున్నారు. ఈ సైద్ధాంతిక, సంస్థాగత ఘర్షణలకు మే 2026లో కేంద్ర విద్యాశాఖ తీసుకువచ్చిన 'మూడు భాషల విధానం' ఆజ్యం పోసింది. తొమ్మిదో తరగతి విద్యార్థులకు మూడవ విధిగా చదవాల్సిన భాషను అమలు చేయాలన్న కేంద్ర నిర్ణయాన్ని, జాతీయ నాయకుడిగా ఉంటూనే అన్నామలై బాహాటంగా తీవ్రస్థాయిలో వ్యతిరేకించారు. తమిళ ఆత్మాభిమానాన్ని దెబ్బతీసే ఏ నిర్ణయాన్నైనా ఎదిరిస్తానని ఢిల్లీ పెద్దలకు ఆయన పంపిన ప్రత్యక్ష హెచ్చరిక అది. ఢిల్లీకి వెళ్లే ముందు ఆయన జాతీయ నాయకత్వానికి ఒక అల్టిమేటం జారీ చేశారు: "తమిళనాడులో పార్టీని నడిపించే పూర్తి స్వయంప్రతిపత్తిని కనీసం ఏడేళ్ల పాటు నాకు ఇవ్వండి, లేదా నన్ను నా దారిన పోనివ్వండి" అని తేల్చిచెప్పారు. ఆ మాటలు పెడచెవిన పెట్టడంతోనే ఆయన ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. అన్నామలై నిర్ణయాన్ని అత్యంత బలంగా ప్రభావితం చేసిన మరో చారిత్రక పరిణామం 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సంచలన ఫలితాలు. మే 4, 2026 నాడు వెలువడిన ఈ ఫలితాలు గత 59 ఏళ్ల ద్రావిడ ఆధిపత్యాన్ని శాశ్వతంగా తుడిచిపెట్టాయి. ప్రముఖ సినీ నటుడు విజయ్ స్థాపించిన "తమిళగ వెట్రి కళగం" పార్టీ తన తొలి ఎన్నికల్లోనే ఏకంగా 108 స్థానాలను కైవసం చేసుకుని, కాంగ్రెస్ మరియు వామపక్షాల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. మరోవైపు అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకుని బరిలోకి దిగిన బీజేపీ కేవలం 3 శాతం ఓటు షేరుతో ఒకే ఒక్క సీటుకే పరిమితమై, ఢిల్లీ వ్యూహకర్తల ముఖాన కరిపొడిచినట్లు దారుణ పరాజయాన్ని మూటగట్టుకుంది. యువత మరియు ప్రభుత్వ వ్యతిరేక ఓటర్లు ఇప్పుడు పాత కాలపు ద్రావిడ రాజకీయాలపై, సంప్రదాయ పొత్తులపై ఏమాత్రం ఆసక్తిగా లేరని ఈ ఫలితాలు కుండబద్దలు కొట్టాయి. విజయ్ ఆక్రమించిన ఈ నూతన రాజకీయ క్షేత్రంలో, జాతీయ పార్టీ సంకెళ్లతో ఉంటూ పోరాడటం అసాధ్యమని గ్రహించిన అన్నామలై, తనదైన స్వతంత్ర మార్గాన్ని ఎంచుకోవడమే శరణ్యమని బలంగా విశ్వసించారు. భారతీయ జనతా పార్టీ నుంచి బయటకు వచ్చిన అన్నామలై భవిష్యత్ వ్యూహం అత్యంత పకడ్బందీగా, ఒక రాజకీయ మాస్టర్‌స్ట్రోక్‌గా ఉండబోతోంది. జూన్ 4వ తేదీన తన జన్మదినం సందర్భంగా ఆయన ఒక భారీ విలేకరుల సమావేశం నిర్వహించి తన కార్యాచరణను ప్రకటించనున్నారు. రాజకీయ వర్గాల సమాచారం ప్రకారం, ఆయన తక్షణమే రాజకీయ పార్టీని ప్రకటించకుండా, ముందుగా "మక్కల్ శక్తి ఇయక్కం" (ప్రజా శక్తి ఉద్యమం) పేరిట ఒక నూతన సామాజికరాజకీయ ఉద్యమాన్ని ప్రారంభించనున్నారు. కాంగ్రెస్ ఎంపీ కార్తి చిదంబరం సైతం ఇదే విషయాన్ని పరోక్షంగా ధృవీకరిస్తూ ట్వీట్ చేశారు. కుల, మతాలకు అతీతంగా వివిధ వృత్తుల నుంచి వచ్చిన యువతను, మేధావులను ఒక వేదికపైకి తెచ్చి, ఒక స్వచ్ఛంద సంస్థ తరహాలో క్షేత్రస్థాయిలో సమస్యలపై పోరాడిన అనంతరం, ప్రజల అపూర్వ స్పందనను బట్టి దానిని ఒక ప్రాంతీయ ప్రభంజన పార్టీగా మార్చాలన్నది ఆయన దీర్ఘకాలిక వ్యూహం. ఇప్పటికే కోయంబత్తూరు తదితర ప్రాంతాల్లో "నాయకా రా.. మమ్మల్ని నడిపించు" (Our Leader, Come and Lead Us) అంటూ వెలసిన భారీ పోస్టర్లు ఆయన రాబోయే నూతన రాజకీయ సునామీకి స్వాగతం పలుకుతున్నాయి.

ఈ నూతన రాజకీయ ప్రయాణానికి ఒక బలమైన సైద్ధాంతిక అస్త్రంగా అన్నామలై "ద్రావిడియన్ 2.0" అనే సరికొత్త నినాదాన్ని తెరపైకి తీసుకురాబోతున్నారు. ఇది సంప్రదాయక మితవాద హిందుత్వకు, అలాగే పాత ద్రావిడ పార్టీల సంకుచిత ప్రాంతీయవాదానికి పూర్తి భిన్నమైనది. మైనారిటీలను సైతం కలుపుకుపోయే అచ్చమైన లౌకికవాదంతో పాటు, భారతీయ రాజ్యాంగ చట్రంలో ఉంటూనే తమిళ ఆత్మాభిమానాన్ని సగర్వంగా చాటుకోవడం ఈ విధానం ముఖ్య ఉద్దేశం. విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ అంబేద్కర్, పెరియార్, కామరాజ్ లాంటి లెఫ్ట్‌సెంటర్ సిద్ధాంతాలను అనుసరిస్తుండగా , అన్నామలై తన "సెక్యులర్ మరియు తమిళ్ ఫస్ట్" విధానం ద్వారా దానికి దీటైన, బలమైన సైద్ధాంతిక ప్రత్యామ్నాయాన్ని నిర్మించబోతున్నారు. అన్నాడీఎంకే అధినాయకత్వం పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్న పశ్చిమ తమిళనాడులోని పారిశ్రామిక వర్గాల మద్దతు, అలాగే తన పాదయాత్ర ద్వారా నిర్మించుకున్న అపారమైన యువ వాలంటీర్ నెట్‌వర్క్ ఆయనకు కొండంత అండగా మారనున్నాయి.

ముగింపుగా విశ్లేషిస్తే, అన్నామలై రాజీనామా అనేది ఒక వ్యక్తిగత వైఫల్యం ఎంతమాత్రం కాదు; అది క్షేత్రస్థాయి వాస్తవాలను పక్కన పెట్టి గల్లీ రాజకీయాలను ఢిల్లీ నుంచి శాసించాలనుకున్న జాతీయ పార్టీ అహంకారానికి పట్టిన గతి. కేవలం కుల సమీకరణాలు, పనికిమాలిన పొత్తుల కోసం ఒక అద్భుతమైన మాస్ లీడర్‌ను వదులుకోవడం ద్వారా బీజేపీ దక్షిణ భారతదేశంలో తన రాజకీయ సమాధిని తానే కట్టుకుంది. మరోవైపు తమిళనాడు రాజకీయాలు ఇప్పుడు పాత తరం నేతలైన స్టాలిన్, పలనిస్వామిల చీకటి నీడల నుంచి విముక్తి పొంది, యువ కిశోరాలైన ముఖ్యమంత్రి విజయ్ వర్సెస్ ఫైర్‌బ్రాండ్ నాయకుడు అన్నామలై అనే నూతన ద్విధ్రువ పోరుగా రూపాంతరం చెందుతున్నాయి. ఒక పోలీస్ అధికారిగా మొదలై, కమల దళపతిగా ఎదిగి, నేడు సొంత సైన్యాన్ని నిర్మించుకునే స్థాయికి చేరుకున్న అన్నామలై ప్రస్థానం రాబోయే రెండు దశాబ్దాల తమిళనాడు రాజకీయ చరిత్రలో ఒక నూతన ప్రజాస్వామ్య విప్లవానికి నాంది పలకబోతోందనడంలో ఎటువంటి సందేహమూ లేదు!

# సరిహద్దులు దాటుతున్న టారిఫ్ సెగలు

సమకాలీన ప్రపంచీకరణ యుగంలో దేశాల మధ్య సరిహద్దులు చెరిగిపోయి, ఆర్థిక వ్యవస్థలు పరస్పరం పెనవేసుకుపోయాయి. ఇలాంటి తరుణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న 'అమెరికా ఫస్ట్' అనే నయా రక్షణవాద విధానం అంతర్జాతీయ వాణిజ్య రంగంలో ఒక పెద్ద భూకంపాన్ని సృష్టించింది. చైనా, మెక్సికో, కెనడా, బ్రెజిల్ మరియు భారతదేశం వంటి ప్రధాన భాగస్వామ్య దేశాలపై ఎలాంటి ముందస్తు సంప్రదింపులు లేకుండా అమెరికా కఠినమైన నూతన సుంకాలు విధించడం ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపుతోంది. వాణిజ్య లోటును తగ్గించుకోవడం, తమ దేశీయ తయారీ రంగాన్ని కాపాడుకోవడం అనే పేరుతో అమెరికా చేస్తున్న ఈ ఏకపక్ష ఆర్థిక యుద్ధం, కోవిడ్ తర్వాత ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న గ్లోబల్ సప్లై చైన్‌ను అత్యంత తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టివేస్తోంది. స్వేచ్ఛా వాణిజ్య సూత్రాల పునాదులను కదిలిస్తున్న ఈ నిర్ణయం కేవలం ఒక ద్వైపాక్షిక వివాదంగా మిగిలిపోకుండా, యావత్ ప్రపంచ ఆర్థిక మనుగడకు సవాలుగా మారుతోంది.

ఈ భారీ సుంకాల విధింపు కోసం అమెరికా తన సొంత దేశీయ చట్టాలైన సెక్షన్ 232, సెక్షన్ 301 వంటివాటిని ఏకంగా ఒక ఆయుధంలా వాడుకుంటోంది. జాతీయ భద్రత, అనైతిక వాణిజ్య పద్ధతులు అనే కారణాలను చూపుతూ సుమారు 25 శాతం నుంచి 50 శాతం వరకు సుంకాలు విధించడం ప్రపంచ దేశాలను విస్మయానికి గురిచేసింది. అయితే, ఈ వ్యవహారంలో 2026 ఫిబ్రవరి మరియు మే నెలల్లో అమెరికా సుప్రీం కోర్టు మరియు అంతర్జాతీయ వాణిజ్య న్యాయస్థానాలు సంచలన తీర్పులు వెలువరించాయి. చట్టాల ముసుగులో దేశాధ్యక్షుడికి ఏకపక్షంగా ప్రపంచవ్యాప్త సుంకాలు విధించే అధికారం లేదని కోర్టులు స్పష్టం చేయడంతో అంతర్జాతీయ వాణిజ్యంలో తీవ్ర అనిశ్చితి నెలకొంది. చట్టవిరుద్ధంగా వసూలు చేసిన మిలియన్ల డాలర్ల సుంకాలను తిరిగి పొందేందుకు ప్రపంచవ్యాప్త ఎగుమతిదారులు ఇప్పుడు న్యాయస్థానాలను ఆశ్రయిస్తుండటంతో న్యాయపరమైన సంక్లిష్టతలు మరింత జటిలమయ్యాయి.

సుంకాల యుద్ధం వల్ల వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయి ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం భారం నేరుగా సామాన్యుడిపై పడుతోంది. అయితే, అంతర్జాతీయ ద్రవ్య నిధి తాజా నివేదికల ప్రకారం ఈ వాణిజ్య మందగమనం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుందన్న భయాలు కొంతమేర తగ్గాయి. 2026 నాటికి ప్రపంచ ఆర్థిక వృద్ధి 3.3 శాతంగా స్థిరపడుతుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. అకస్మాత్తుగా ఎదురయ్యే మార్పులకు అనుగుణంగా బహుళజాతి కంపెనీలు తమ సరఫరా గొలుసులను అత్యంత వేగంగా మార్చుకోవడం, అలాగే కృత్రిమ మేధస్సు వంటి సాంకేతిక రంగాలలో పెట్టుబడులు వెల్లువెత్తడమే ఈ వృద్ధికి ప్రధాన కారణం. అయినప్పటికీ, అమెరికాలో ద్రవ్యోల్బణం 2.9 శాతం వద్ద కొనసాగుతుండటంతో పాటు, వడ్డీ రేట్లు తగ్గకపోవడం వల్ల అభివృద్ధి చెందుతున్న దేశాల కరెన్సీల విలువ పడిపోయి ఆయా దేశాలపై దిగుమతుల భారం అనూహ్యంగా పెరుగుతోంది.



అమెరికా తన వాణిజ్య యుద్ధంలో దశాబ్దాలుగా నమ్మకమైన మిత్రదేశాలుగా ఉన్న కెనడా, మెక్సికోలను కూడా ఏమాత్రం వదిలిపెట్టలేదు. ఈ రెండు దేశాలపై కూడా భారీ సుంకాలు విధించడంతో ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలు ఒక్కసారిగా కుదిపేయబడ్డాయి. ముఖ్యంగా అమెరికా విధించిన సుంకాల కారణంగా మెక్సికో ఉక్కు ఎగుమతులు 36.6 శాతం క్షీణించి భారీగా పడిపోయాయి, దీనివల్ల ఆ దేశ ఉక్కు పరిశ్రమ ఉత్పత్తి సామర్థ్యం 25 ఏళ్ల కనిష్టానికి అంటే కేవలం 55 శాతానికి పడిపోయి తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. మరోవైపు బ్రెజిల్ వంటి దేశాలపై కూడా 40 శాతం సుంకాలు విధించినప్పటికీ, ఆ దేశం ఏమాత్రం కుంగిపోకుండా తన అత్యుత్తమ వ్యవసాయ ఎగుమతులను ఆసియా, యూరప్, కెనడా వంటి ఇతర నూతన మార్కెట్లకు మళ్లించింది. 2025లో బ్రెజిల్ వ్యవసాయ ఎగుమతులు రికార్డు స్థాయిలో 169.2 బిలియన్ డాలర్లకు చేరుకొని, ఒక సవాలును అవకాశంగా ఎలా మలచుకోవాలో ప్రపంచ దేశాలకు ఒక గొప్ప ఆదర్శవంతమైన ఉదాహరణగా నిలిచింది.

ఈ సుంకాల విధానం వెనుక అమెరికా ప్రధాన వ్యూహాత్మక లక్ష్యం చైనా ఆధిపత్యాన్ని నిలువరించడమే అయినప్పటికీ, ఆ వ్యూహం పూర్తిగా ఫలించలేదనే చెప్పాలి. సుంకాల కారణంగా చైనా తన ఉత్పత్తులను నేరుగా అమెరికాకు ఎగుమతి చేయడానికి బదులుగా వియత్నాం, థాయ్‌లాండ్, మలేషియా వంటి దేశాలతో పాటు భారత్ మీదుగా అమెరికాకు మళ్లిస్తూ పరోక్ష వాణిజ్యాన్ని విజయవంతంగా సాగిస్తోంది. దీనికి తోడుగా, చైనాలో భారీగా పేరుకుపోయిన ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీలు, సోలార్ ప్యానెళ్లు మరియు ఉక్కు మిగులు ఉత్పత్తులను ఆ దేశం ఇతర మార్కెట్లలోకి అతి తక్కువ ధరకు డంప్ చేస్తోంది. ఈ డంపింగ్ కారణంగా స్థానిక పరిశ్రమల మనుగడకు అత్యంత ప్రమాదకరమైన ముప్పు ఏర్పడుతోంది. ఉదాహరణకు, చైనా మిగులు ఉక్కు వల్ల భారతీయ మార్కెట్ ఒత్తిడికి గురికావడంతో, దేశీయ ఉత్పత్తిదారులను రక్షించేందుకు భారత ప్రభుత్వం ఏప్రిల్ నెలలో 12 శాతం సెఫ్‌గార్డ్ డ్యూటీని విధించాల్సి రావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

భారతదేశం విషయానికి వస్తే, గత కొంత కాలంగా అమెరికాతో వాణిజ్య సంబంధాలు ఒక తీవ్రమైన రోలర్‌కోస్టర్‌ను తలపించాయి. రష్యా చమురు కొనుగోళ్లపై అభ్యంతరం తెలుపుతూ భారత్‌పై అమెరికా తొలుత శిక్షాత్మక సుంకాలు విధించినప్పటికీ, నిరంతర దౌత్యపరమైన చర్చల ద్వారా ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టాయి. 2026 జూన్ మొదటి వారంలో న్యూఢిల్లీ వేదికగా జరుగుతున్న తాజా వాణిజ్య చర్చల్లో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ, ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం తొలి దశ దాదాపు ఖరారైందని స్పష్టం చేశారు. కేవలం చిన్నపాటి సవరణలు, అనగా కామాలు, ఫుల్‌స్టాప్‌లు మాత్రమే మిగిలి ఉన్నాయని ఆయన చెప్పడం రెండు దేశాల మధ్య సానుకూల వాతావరణాన్ని ప్రతిబింబిస్తోంది. ఈ ఒప్పందం ద్వారా అమెరికా తమపై విధించిన పరస్పర సుంకాలను 18 శాతానికి తగ్గించడంతో పాటు, పలు వస్తువులకు మినహాయింపులు లభించడం భారతీయ ఎగుమతిదారులకు ఏటా బిలియన్ డాలర్ల మేర ఉపశమనం కలిగించనుంది.

భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటి ఐటీ మరియు ఫార్మా రంగాలు కూడా ఈ వాణిజ్య యుద్ధం వల్ల పరోక్షంగా తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్నాయి. భారత్ నుంచి అమెరికా మార్కెట్‌కు ఎగుమతి అయ్యే మందుల్లో 90 శాతం జనరిక్ ఔషధాలే కావడంతో ఫార్మా రంగానికి ప్రస్తుతానికి ఈ భారీ సుంకాల నుండి తాత్కాలిక మినహాయింపు లభించినప్పటికీ, పేటెంటెడ్ ఔషధాలపై ఉన్న ఆంక్షల వల్ల భవిష్యత్తుపై అనిశ్చితి కొనసాగుతూనే ఉంది. ఇక ఐటీ రంగం పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతోంది. అమెరికా సుంకాల వల్ల అక్కడి కార్పొరేట్ కంపెనీల ముడిసరుకు ఉత్పత్తి వ్యయం పెరిగిపోయి, వారు తమ వార్షిక డిజిటల్ మరియు ఐటీ బడ్జెట్లను భారీగా తగ్గించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీనివల్ల హైదరాబాద్ లాంటి నగరాల్లో సుమారు లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లకు (GCCs) వచ్చే కొత్త ప్రాజెక్టుల సంఖ్య తగ్గిపోయి, రాబోయే కాలంలో నియామకాలపై స్వల్పకాలిక ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది.

ముగింపుగా విశ్లేషిస్తే, రక్షణవాదం మరియు ఈ సుంకాల యుద్ధాలు స్వల్పకాలంలో స్థానిక పరిశ్రమలకు మేలు చేసినట్లు, రాజకీయ లబ్ధిని చేకూర్చినట్లు కనిపించినా, దీర్ఘకాలంలో అవి మొత్తం ప్రపంచ ఆర్థిక వృద్ధిరేటును మందగింపజేస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదు. ఏ దేశమూ ఒంటరిగా మనుగడ సాగించలేని నేటి ఈ ఆధునిక ప్రపంచీకరణ యుగంలో, అగ్రరాజ్యం తీసుకునే అకారణ నిర్ణయాలు వందలాది కిలోమీటర్ల దూరంలో ఉన్న మరెన్నో దేశాల సామాన్యుల జీవితాలపై అనూహ్య ప్రకంపనలు సృష్టిస్తాయి. కాబట్టి అమెరికా తన ఏకపక్ష విధానాలను తక్షణమే పునఃసమీక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



# ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- **జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్**

**సత్తుపల్లి, జూన్ 2: మహా :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ప్రాంగణంలో సోమవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనేక మంది చేసిన పోరాటం ఫలితంగానే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పేదవాడి అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రజల అభివృద్ధికి అహర్నిశలు పోరాడే పలు పార్టీల నాయకులను ఎమ్మెల్యే రాగమయి సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రెహానా బేగం కమల్ పాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ బొంతు సుమలత, సత్తుపల్లి ఏఎంసి చైర్మన్ దోమ ఆనంద్ బాబు, కమల్ పాషా, బీసీ నేత నారాయణ వరపు శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గాదె చెన్నారావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, యువత, మహిళలు, పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# షబ్బీర్ అలీని సత్కరించిన కంది శ్రీనివాస రెడ్డి

ఆదిలాబాద్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ ను కంది శ్రీనివాస రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛమందించి శాలువాతో సత్కరించారు.



# కాంగ్రెస్ లో చేరికలు

**ఆదిలాబాద్:** బిజెపి అనుసరిస్తున్న విధానాల పట్ల ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారని కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కార్యక్రమాలు చూసి కాంగ్రెస్ పార్టీ లోకి చేరుతున్నారని డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ అన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన చేరికల కార్యక్రమంలో ఆయన ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ఇతర నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలం తంతోలి గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు పిఎసిఎస్ డైరెక్టర్ కన్య వినోద్ రెడ్డి, మాజీ వార్డ్ మెంబర్ రొండ్ల పోశెట్టి లకు కండువా కప్పి కాంగ్రెస్ పార్టీ లోకి ఆహ్వానించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం డిజిల్ పెట్రోల్ ధరలు పెంచి పేద మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తుందని, కేంద్ర ప్రభుత్వం పంటలకు మద్దతు ధర ప్రకటించడమే గాని రైతుల వద్ద జొన్న మొక్కజొన్న కొనుగోలు చేయట్లేదని నేతలు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పుల భారంలో ఉన్న ఎంత కష్టమైనా రైతుల వద్ద ప్రతి గింజ కొనుగోలు చేస్తూందని అన్నారు. కంది శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రోజురోజుకూ కాంగ్రెస్ పార్టీ బలోపేతమవుందని ఇలాంటి చేరికల వలన పార్టీలో నూతనోత్సాహం వస్తుందన్నారు. పార్టీ మరింత పటిష్టంగా తయారై ఎన్నికలేవైనా తిరుగులేని విజయాలు అందుకునే బలోపేతం చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష , మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ ,కాంగ్రెస్ నేతలు గంద్రత్ సుజాత, అల్లూరి సంజీవ రెడ్డి , లోక ప్రవీణ్ రెడ్డి, వెంకటేష్ , రాజేశ్వర్ , దందు మధుకర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

**అమరుల త్యాగాలను స్మరించుకున్న నాయకులు**



**జూలూరుపాడు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండల వ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని రెవిన్యూ, మండల పరిషత్, విద్యుత్, విద్యాశాఖ, వ్యవసాయ శాఖ, వెలుగు, పోలీస్, ఫారెస్ట్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వెటర్నరీ కార్యాలయాలతో పాటు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాలలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాల లేసి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఎందరో త్యాగధనుల పునాదులపై ఏర్పడ్డ తెలంగాణను అన్ని విధాల అభివృద్ధి చేసుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి, తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్వో, ఎంపీడీవో, ఎంఈఓ, ఏవో, ఏఈ ఎస్సై, ఎఫ్ఆర్వో, మండల వైద్యాధికారి, మండల పశువైద్యాధికారి తోపాటు ఉపాధ్యాయులు, అన్ని గ్రామపంచాయతీల సర్పంచ్ లు, కార్యదర్శులు, ఏఈఓలు, అంగన్వాడి కార్యకర్తలు, ఆశ వర్కర్లు, ఉద్యమకారులు, యువకులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- **మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**భద్రాద్రి బ్యూరో, మహా:** ప్రజా సంక్షేమం సమగ్ర అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ప్రగతి మైదానంలో మంగళవారం ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ సహకార మార్కెటింగ్ చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎందరెందరో అమర వీరుల త్యాగాల పునాదుల మీద ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం ఈ రోజు అన్ని రంగాల్లో దశదిశలా వెలుగులు విరజిమ్ముతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పేరిట ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తుందన్నారు. గ్రామ వార్డు స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి వేగవంతంగా పరిష్కరించడం, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. పెండింగ్ సమస్యల పరిష్కారం ప్రభుత్వ సేవల సరళీకరణ ఉపాధి అవకాశాల కల్పన మహిళల ఆర్థిక సాధికారత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. పది వారాల పాటు వివిధ శాఖల ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహించి ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించినట్లుగా పేర్కొన్నారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందిస్తూ అభివృద్ధి కార్యక్రమాల అమలుకు మరింత వేగం తీసుకువచ్చినట్లుగా చెప్పారు. రైతును రాజును చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం చారిత్రాత్మక చర్యలు చేపడుతోందన్నారు. దేశంలో తొలిసారిగా రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ అమలు చేయడంతో పాటు, రైతు భరోసా పథకం ద్వారా ప్రతి ఎకరానికి ఏడాదికి రూ.12,000 చొప్పున ఇప్పటివరకు జిల్లాలో 2 లక్షల 7 వేల మూడు 391 మంది రైతుల ఖాతాల్లో ఒక వెయ్యి 44 కోట్ల 39 లక్షల రూపాయలు పెట్టుబడి సాయం నేరుగా జమ చేయడం జరిగిందన్నారు. అలాగే ఒక లక్ష 5 వేల 871 మంది రైతులకు రైతు బీమా మంజూరు చేయగా అందులో ఒక వెయ్యి తొమ్మిది వందల ఇరవై నాలుగు మంది రైతు కుటుంబాలకు రూ.96 కోట్ల 20 లక్షల ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా 530 రైతులకు 3 కోట్లు ప్రకృతి వ్యవసాయంకు ప్రోత్సాహం అందిస్తున్నామని చెప్పారు. సీతారామ ఎత్తిపోతల పథకం ప్రధాన కాలువ పనులు పూర్తి అయినట్లు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో 875 కోట్ల రూపాయలతో 127 రహదారుల పనులు చేపట్టగా అందులో 48 పనులు పూర్తికాగా 79 పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పారు. రవాణా సౌకర్యాల విస్తరణ లక్ష్యంగా పాండురంగాపురంసారపాక రైల్వే లైన్ పనులు పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగిందన్నారు. అలాగే కొత్తగూడెంలో విమానాశ్రయ ఏర్పాటు కోసం ఆమోదం పొందేందుకు ముమ్మరంగా చర్యలు చేపడుతూ జిల్లాకు మెరుగైన వైమానిక అనుసంధానం కల్పించేందుకు కృషి కొనసాగుతోందన్నారు. రాష్ట్రంలో విద్య వైద్య అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తూ ప్రత్యేక బడ్జెట్ ను కేటాయిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఇతర శాఖల అధికారులతో పాటు ఉద్యోగులు ప్రజలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి అభివృద్ధికి ప్రతి ఉద్యోగి కృషి చేయాలి

- **సింగరేణి డైరెక్టర్ కే.వెంకటేశ్వర్లు**
- **సింగరేణి ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**



భద్రాద్రి బ్యూరో, మహా:సింగరేణి కాలరీస్ కంపెనీ అభివృద్ధికి ప్రతి ఉద్యోగి చిత్తశుద్ధితో కృషి చేయాలని సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) కే వెంకటేశ్వర్లు అన్నారు. కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియం నందు సింగరేణి ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి సింగరేణి డైరక్టర్ కే.వెంకటేశ్వర్లు ముఖ్యఅతిధిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం ఆరు దశాబ్దాల పాటు కొనసాగిన అలుపు లేని పోరాటంలో తమ సర్వస్వం ధారపోసి ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు అందరి తరపున ఘన నివాళులు అర్పిస్తున్నానని పేర్కొన్నారు. సింగరేణి కార్మికులు కూడా రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొని తమ వంతు బాధ్యత నిర్వహించారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అన్ని రంగాలలో విశేష అభివృద్ధిని సాధించిందని తెలిపారు. వ్యవసాయం పారిశ్రామిక రంగం విద్య వైద్యం మౌలిక సదుపాయాలు విద్యుత్ ఉత్పత్తి వంటి అనేక రంగాలలో రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఈ అభివృద్ధిలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ పాత్ర అత్యంత కీలకమైందన్నారు. సుమారు 137 సంవత్సరాల చరిత్ర కలిగిన సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థికాభివృద్ధికి వెన్నెముకగా నిలుస్తుందని చెప్పారు. బొగ్గు ఉత్పత్తి ద్వారా విద్యుత్ రంగానికి నిరంతర ఇంధనాన్ని అందిస్తూ దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలోని మొత్తం బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి దాదాపు 7.5 శాతం వాటాను కలిగి ఉందని చెప్పారు. సింగరేణి ఇప్పుడు కేవలం బొగ్గు సంస్థగానే కాకుండా బహుముఖ రంగాలలో అభివృద్ధి చెందుతున్న ఆధునిక శక్తి సంస్థగా రూపాంతరం చెందుతుందన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని సింగరేణి పునరుత్పాదక శక్తి రంగంలో మరింత విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తుందన్నారు. సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి స్థిరత్వాన్ని కొనసాగించేందుకు కొత్త గనుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు. భవిష్యత్తులో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు తొమ్మిది కొత్త బొగ్గు గని ప్రాజెక్టులను ప్రతిపాదించి అవసరమైన అనుమతుల కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపిందన్నారు. కొత్త ప్రాజెక్టుల ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నయని తెలిపారు. జిఎం(పర్సనల్) కవితా నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమములో డైరక్టర్(ఈ అండ్ ఎం) ఎం.తిరుమల రావు, గుర్తింపు సంఘం (ఏఐటియూసి) జనరల్ సెక్రటరీ కే.రాజ్ కుమార్, ప్రాతినిధ్య సంఘం (ఐఎన్టియూసి)సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సి.త్యాగరాజన్, సిఎంఓఏఐ ప్రెసిడెంట్ టి.లక్ష్మీపతి గౌడ్, జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ కే.అజయ్ కుమార్, కార్పొరేట్ పరిధిలోని వివిధ శాఖల జనరల్ మేనేజర్లు, వివిధ శాఖల అధిపతులు, యూనియన్ నాయకులు, ఉత్తమ ఉద్యోగులు, కార్మికుల కుటుంబ సభ్యులు, వెల్ఫేర్ ఎస్ అండ్ పిసి ఇబ్బంది, సేవ సెక్రటరీలు, ఇతర అధికారులు, ఉద్యోగులు, కళాకారులు కళాశాల పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- **జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మండల అధ్యక్షుడు విజయ్ నాయుడు**

**చర్ల, మహా :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని చర్ల మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ నాయుడు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు.ఈ కార్యక్రమానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్, డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు చీమలమర్రి మురళీకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరై తెలంగాణ అమరవీరులకు నివాళులు అర్పించారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సేవలను స్మరించుకుంటూ వారి త్యాగాలను కొనియాడారు .ఈ సందర్భంగా విజయ్ నాయుడు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం విద్యార్థులు, యువత, ఉద్యోగులు, ప్రజలు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రజల దీర్ఘకాల పోరాట ఫలితమని పేర్కొంటూ, రాష్ట్ర అభివృద్ధి మరియు సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ ఆకాంక్షను నెరవేర్చిన పార్టీగా కాంగ్రెస్ చరిత్రలో నిలిచిందని పేర్కొన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రం మరింత పురోగతి సాధించేలా అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని సూచించారు.డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు చీమలమర్రి మురళీకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణతో పాటు ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో చర్ల మండల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ రాష్ట్ర అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు.తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ కార్యక్రమం ముగిసింది.

**గిరిజన బిడ్డ**

# ఎస్సై సురేందర్ కు దక్కిన అరుదైన గౌరవం

- **పోలీస్ శౌర్య పతాకానికి ఎంపిక**

**కారేపల్లి, మహా:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పోలీసు, అగ్నిమాపక శాఖలలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రభుత్వం సోమవారం శౌర్య పతకాలను ప్రకటించింది.రాష్ట్రవ్యాప్తంగా 10 మందికి శౌర్య పతకాలు ప్రకటించగా సింగరేణి మండలం వెంకట్యతండా గ్రామపంచాయతీ పరిధిలోని భల్లునగర్ తండాకు చెందిన ఎస్సై బానోతు సురేందర్ కూడా వీరిలో ఒకరుగా ఎంపికయ్యారు.సురేందర్ కొంతకాలంగా పోలీస్ గ్రేహౌండ్స్ విభాగంలో సబ్ ఇన్స్పెక్టర్ హోదాలో పనిచేస్తున్నారు.తెలంగాణ అవతరణ దినోత్సవం జూన్ 2 సందర్భంగా ప్రకటించిన జాబితాలో ఉన్న పోలీస్ ఉద్యోగులకు ఆగస్టు 15 న స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఈ శౌర్య పతకాలను ప్రత్యక్షంగా అందజేయనున్నారు.





# విద్యాశాఖ అధికారిణిగా వాసంతి

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన జిల్లా విద్యాశాఖ అధికారిణి (డీఈవో)గాడి.వాసంతి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా విధులలో చేరిన జిల్లా విద్యా శాఖాధికారిణి వాసంతిని జిల్లా విద్యాశాఖా కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడి)శంభు ప్రసాద్ కార్యాలయ సిబ్బంది పుష్ప గుచ్ఛంతో స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె జిల్లా కలెక్టర్ అంకిత్ ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు సంకేతంగా కలెక్టర్ కి మొక్కను అందజేశారు.జిల్లాలో విద్యా ప్రమాణాల మెరుగుదల, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల విద్యా ఫలితాల పెంపు, ప్రభుత్వ విద్యా కార్యక్రమాల సమర్థవంతమైన అమలుకు ప్రత్యేక కృషి చేస్తానని డి.వాసంతి తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



**సింగరేణి ముట్టడికి పిలుపునిచ్చిన**

# ఎల్.హెచ్.పి.ఎస్ నాయకుల అరెస్ట్

**సత్తుపల్లి, జూన్ 2: మహా :** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సింగరేణి ప్రభావిత ప్రాంత ప్రజలతో సింగరేణి ముట్టడికి పిలుపునిచ్చిన సత్తుపల్లి పట్టణంలోని ఎన్.టి.ఆర్ నగర్ కాలనీకి చెందిన లంబాడీ హక్కుల పోరాట సమితి వర్కింగ్ ప్రెసిడెంట్,సింగరేణి ప్రభావిత ప్రాంతాల అధ్యక్షులు బానోత్ నందు నాయక్ ను సత్తుపల్లి పోలీసులు అర్ధరాత్రి అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా నందు నాయక్ మాట్లాడుతూ అర్ధరాత్రి అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని చలో కొత్తగూడెం సింగరేణి పై మహా ధర్నా కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి ప్రభుత్వం పోలీసులతో అరెస్టు చేయటం బాధాకరమని అన్నారు. ఎన్ని అరెస్టులు చేసిన ఉద్యమాన్ని ఆపబోమని ప్రభుత్వ నాయకులను హెచ్చరించారు. జిల్లా ముగ్గురు మంత్రులు స్పందించి సత్తుపల్లి సింగరేణి ఎన్.టి.ఆర్ కాలనీలోని బాంబ్ బ్లాస్టింగ్ లతో దెబ్బతిన్న ఇళ్లను సింగరేణి యాజమాన్యం స్పందించి పూర్తిస్థాయి ఇండ్ల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం తక్షణమే స్పందించి ఇండ్ల నిర్మాణం చేపట్టకపోతే దశల వారీగా ఉద్యమాలు నిర్వహించి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని వారు హెచ్చరించారు.

# వాగులో మునిగి తండ్రి-కొడుకుల మృతి

**చర్ల, మహా :** మొగళ్లపల్లి గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. తాలిపేరు వాగులో చేపల వేటకు వెళ్లిన తండ్రికొడుకులు నీటిలో మునిగి మృతి చెందడంతో గ్రామమంతా శోకసంద్రంలో మునిగిపోయింది.మొగళ్లపల్లి గ్రామానికి చెందిన రాముల సూర్యరావు (38), ఆయన కుమారుడు దేవ్ హర్ష మంగళవారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో తాలిపేరు వాగులో చేపల వేట కోసం వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు ఇద్దరూ నీటిలో మునిగిపోయినట్లు స్థానికులు తెలిపారు.సమాచారం అందుకున్న గ్రామస్తులు, కుటుంబ సభ్యులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టగా, అనంతరం ఇద్దరి మృతదేహాలు వెలికితీశారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు సభ్యులు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.గ్రామస్తుల సమాచారం ప్రకారం, సూర్యరావు గ్రామంలో అందరితో కలిసిమెలిసి ఉండే వ్యక్తిగా పేరుపొందారు. కుమారుడు దేవ్ హర్ష మృతి చెందడంతో కుటుంబ సభ్యుల ఆవేదన వర్ణనాతీతంగా మారింది. భర్త, కుమారుడిని ఒకేసారి కోల్పోయిన భార్య రాణి రోదనలు అక్కడున్న వారిని కంటతడి పెట్టించాయి.

## పండుగలా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

**జెండా ఎగరవేసిన మాజీ మేయర్ కావ్య**

కుషాయిగూడ, మహా : జవహర్ నగర్ లో పండుగలా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు జరిగాయి. మాజీ మేయర్ మేకల కావ్య ఆధ్వర్యంలో జెండాను ఎగరవేశారు. సీనియర్ నాయకులు కేతమ్మ ఉద్యమ పాటను ఆలపించి అందరిని ఉత్సాహపరిచింది. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సంగీత రాజశేఖర్, నాయకలు సుధాకర్ చారి, బాలరాజ్ పటేల్ ,వెంకటేష్, సిద్దులు యాదవ్, పరుశురాం ,దిలీప్, అశోక్ ,నరేష్, సతీష్, శ్రీకాంత్, శోభ, మంజుల ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.



## బంగారు తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు కండి..

- **రాష్ట్రాభివృద్ధిలో సింగరేణిది కీలక పాత్ర.. : జీఎం దుర్గం రామచందర్**

**మణుగూరు, మహా :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సింగరేణి మణుగూరు ఏరియాలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ బంగారు తెలంగాణ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వేడుకల్లో భాగంగా పీవీ కాలనీ రామాలయం కూడలిలోని తెలంగాణ తల్లి విగ్రహం, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వరకు తెలంగాణ రన్ నిర్వహించారు. తర్వాత అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ అమరవీరులకు, కొమరం భీమ్, చాకలి ఐలమ్మ విగ్రహాలకు జీఎం దుర్గం రామచందర్, అధికారులు, గుర్తింపు సంఘం, ప్రాతినిధ్య సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జీఎం కార్యాలయ ఆవరణలో జరిగిన ప్రధాన కార్యక్రమంలో గాంధీజీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, తెలంగాణ తల్లి, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం జీఎం దుర్గం రామచందర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మణుగూరు ఏరియాలో విశేష ప్రతిభ కనబరిచిన ఇద్దరు ఉద్యోగులను, ఇద్దరు సేవ సభ్యులను సన్మానించారు. అలాగే సింగరేణి పాఠశాల విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం నిర్వహించిన సభలో జీఎం దుర్గం రామచందర్ కార్మికులనుద్దేశించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకోవడం సంతోషకరమన్నారు. రాష్ట్ర ప్రగతిలో, ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడంలో సింగరేణి సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సహకారంతో సింగరేణి మరింత అభివృద్ధి సాధిస్తుందన్నారు. సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డా. బుద్ద ప్రకాశ్ జ్యోతి సారథ్యంలో సింగరేణి విద్యుత్ ఉత్పత్తి, పర్యావరణ పరిరక్షణ, రక్షణ రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతోందన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కాలనీలు, గనులు, పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తున్నామని తెలిపారు. ఇదే ఉత్సాహంతో 202627 సంవత్సరానికి మణుగూరు ఏరియాకు నిర్దేశించిన 96.26 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నాణ్యత, భద్రతకు ప్రాధాన్యమిస్తూ సాధించాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. కార్మిక కుటుంబ సభ్యులు కూడా పరోక్షంగా తమ వంతు సహకారం అందించాలని కోరారు. అనంతరం ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వై. రాంగోపాల్, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ వి. కృష్ణంరాజు, సీఎంఓఏఐ మణుగూరు బ్రాంచ్ సెక్రటరీ మధన్ నాయక్ లు ఉద్యోగులకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పీఓఎంఎన్‌ఓసీ శ్రీనివాస చారి, పీఓపీకేఓసీ ఎం. శ్రీరమేశ్, ఏజీఎం (పర్సనల్) ఎస్. రమేశ్, ఏరియా రక్షణాధికారి వెంకటరామారావు, పీఓకేపీయూజీ వేణుమాధవ్, పీఓఎంఎన్‌ఓసీ ఈ. శ్రీనివాస్, ఏజీఎం (ఐఈడీ) రాంబాబు, డీజీఎం (సివిల్) శివప్రసాద్, డా. శేషగిరిరావు, ఫైనాన్స్ మేనేజర్ రమేశ్, సీనియర్ సెక్యూరిటీ అధికారి కె. శ్రీనివాస్, డిప్యూటీ ఎస్ఈ (సివిల్) ప్రవీణ్, సీనియర్ పర్సనల్ అధికారులు సింగు శ్రీనివాస్, వి. రామేశ్వరరావు, నరేశ్, సేవ సెక్రటరీ షాకీరా బేగం, పీఏ టు జీఎం ఆర్. రాంబాబు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు, సేవ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





## సాకేతపురి ఆంజనేయస్వామిని దర్శించిన శ్రీ అష్టలక్ష్మి పీఠం స్వామి

, **మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలోని సాకేతపురి ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. జేష్ఠ మాస శుభ మంగళవారం, అలాగే యమునా నది పుష్కరాల ప్రారంభ సందర్భంగా అనకాపల్లికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త శ్రీ అష్టలక్ష్మి పీఠం స్వామి పీతాంబరం రఘునాథ చార్య స్వామి ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉదయం సుమారు 9 గంటల సమయంలో ఆలయానికి చేరుకున్న స్వామివారు, శ్రీ సాకేతపురి ఆంజనేయ స్వామితో పాటు శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ సనాతన వైదిక ధర్మం, హిందూ సంస్కృతిని ప్రతి ఒక్కరూ తెలుసుకొని ఆచరణలో పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "గడప లోపల కులం ఉన్నా, గడప దాటితే మనమంతా హిందువులమే. ఐక్యమత్యంతో ఉంటే ఎలాంటి అవరోధాలనైనా ఎదుర్కోవచ్చు" అని పేర్కొన్నారు. అలాగే, శ్రీ ఆంజనేయస్వామిని నిత్యం పూజిస్తే శత్రుపీడలు తొలగిపోతాయని, శ్రీరామ నామస్మరణతో దుఃఖాలు దూరమవుతాయని ఉద్బోధించారు. ఆలయ నిర్మాణం, అభివృద్ధి మరింత బాగా జరగాలని, బాల అరిష్టాలు తొలగి భక్తులకు శుభఫలితాలు కలగాలని స్వామివారు ఆకాంక్షించారు. పుష్కర కాలం కిందట ఇదే ప్రదేశంలో నిర్వహించిన "శ్రీ రామ జయ రామ జయజయ రామ" విజయ మంత్రం 24 గంటల ఏకాహ కార్యక్రమంలో పాల్గొన్న విషయాన్ని కూడా ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సాకేతపురి ఆంజనేయ స్వామి సేవా సమితి సభ్యులు ఎం.వి. సుబ్రహ్మణ్యం, పొట్రు ఏసుబాబు, దారం వెంకటరెడ్డి, హనుమాన్ చాలీసా భక్త బృంద సభ్యులు శ్రీ జి. వెంకటేశ్వరరావు తదితరులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



## బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ సర్కిల్ పరిధిలోని రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. మండల అధ్యక్షులు మంచర్ల మోహన్ రావు, కోలాన్ ప్రదిష్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ఎంతోమంది బలిదానాలతో సాధించుకున్న తెలంగాణ.తెలంగాణ ప్రజల పట్ల అవివక్షత చూపుతూ ఆంధ్ర పెత్తందారులకి రాష్ట్రాన్ని ధారధత్వం చేస్తున్నారని వాపోయారు.ఇది అలాగే కొనసాగితే మరో ఐదేళ్లలో తెలంగాణ తిరిగి కోలుకోవడానికి మరో రెండు దశాబ్దాలు పడుతుందన్నారు. కెసిఆర్ సారథ్యంలో తెలంగాణ ఎంతో సుభిక్షంగా సూసంపన్నంగా ఉండేది. రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దిద్యాల జయమ్మ శ్రీనివాస్, చెక్కల ఎల్లయ్య ముదిరాజు, మాజీ జడ్పీటీసీ బుర్కుంటా సతీష్, శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ పాషా, రాజేందర్, కోఆర్డినేటర్ బుచ్చి రెడ్డి, జయ సింహా, పలు గ్రామల సర్పంచులు, రాజశేఖర్ గౌడ్, దీప మల్లేష్ ముదిరాజ్, మడపతి పరమేశ్వరి చెక్కల శేఖర్, అంకం రాజు, అంకం కుమార్, దిద్యాల కుమార్, కొమ్ము గోపాల్ మహేష్ యాదవ్ శశికాంత్ చెన్నకేశవులు,రాఘవేందర్ రాజేందర్, చెంగాలీ సాయి పరంధానులు, వెంకట్ రెడ్డి, గుంటి చరణ్, మురళి, మహేందర్ నాయక్ హన్మంతు ముదిరాజ్ తదితహులు పాల్గొన్నారు

## పేదల జీవితకాల స్వప్నం సాకారం చేసిన ఇందిరమ్మ ఇళ్లు...

- ఇబ్రహీంపట్నంలో సంబురంగా గృహప్రవేశాలు
- కొత్తింటి వేడుకకు అతిథిగా ఎమ్మెల్యే రంగారెడ్డి...
- కల నెరవేర్చిన మల్ రెడ్డితో లబ్ధిదారుల ఉద్విగ్నక్షణాలు
- అమరవీరుల స్థూపానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే రంగారెడ్డి
- అమరు త్యాగాలు మరువలేనని కొనియాడారు



ఇబ్రహీంపట్నం జూన్ 2 మహా:ఇందిరమ్మ ఇళ్లు.... ఇది కేవలం ఇటుకలు, సిమెంటుతో కట్టిన నిర్మాణం మాత్రమే కాదు, పేదోడికి ఆత్మాభిమానాన్ని, సమాజంలో గౌరవప్రదమైన చిరునామాను ఇస్తున్న వరప్రసాదం. ఏళ్ల తరబడి ఎదురుచూపులు, కోటి ఆశల పేదల కలల సౌధాలను ప్రజాప్రభుత్వం తెచ్చిన ఇందిరమ్మ ఇళ్ల పథకం సాకారం చేసింది. 2024 మార్చిలో తొలివిడతలో భాగంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి 3,500 గృహాలు మంజూరయ్యాయి. నాటి నుంచి లబ్ధిదారుల ఎంపిక, పారదర్శకంగా అమలు, వేగంగా పనులు సాగేలా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఎప్పటికప్పుడూ అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షలు జరుపుతూ వచ్చారు. అలా, నియోజకవర్గవ్యాప్తంగా దాదాపుగా నిర్మాణాలు పూర్తికాగా... తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇబ్రహీంపట్నం టౌన్లో మంగళవారం పలువురు లబ్ధిదారులు నూతన గృహప్రవేశాల కార్యక్రమం ఏర్పాటు చేశారు. సొంతింటి కల నెరవేరిన వేళ నూతన గృహాలను అందంగా ముస్తాబు చేసి, వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి హాజరుకాగా... మంగళహారతులతో ఆయనకు స్వాగతం పలికారు. ఎమ్మెల్యేతో రిబ్బన్ కట్ చేయించి, ఆయన సమక్షంలోనే గృహప్రవేశాలు చేశారు. ఈ సందర్భంగా కొత్తింటిలోకి అడుగుపెట్టిన వారందరికి మల్ రెడ్డి రంగారెడ్డి శుభాకాంక్షలు తెలిపి, ఇంట్లోని దంపతుల నూతన వస్త్రాలు అందజేసి, ఆశీర్వదించారు. వానొస్తే మునిగే గుడిసెలు, గాలికి కూలిపోయే గోడలను అధిగమించి, పేదలకు కట్టబెట్టిన రక్షణ కవచమే ఇందిరమ్మ ఇల్లు అని ఎమ్మెల్యే మల్ రెడ్డి అభివర్ణించారు. తెలంగాణ సెంటిమెంట్ తో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్, వంచనతో ఈ ప్రాంతంలో ప్రజాప్రతినిధిగా కొనసాగిన వారు దశాబ్దకాలంలో ఈ తరహాలో పేదలను ఎందుకు పట్టించుకోలేదని రంగారెడ్డి ప్రశ్నించారు. పేదప్రజల సంక్షేమమే తన ధ్యేయమన్న ఆయన.... ఇందుకోసం ప్రభుత్వంతో కొట్లాడి, తనను నమ్మిన ప్రజలకు అండగా నిలబడతానని హామీ ఇచ్చారు. తొలి విడతలో ఇళ్లు పొందని వారు ఆందోళన చెందవద్దని... అర్హులైన వారందరికీ విడుతల వారీగా ఇంటిని నిర్మించి ఇస్తామని భరోసానిచ్చారు. ముందుగా ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై ఉన్న అమరవీరుల స్థూపానికి ఎమ్మెల్యే రంగారెడ్డి ఘనంగా నివాళులర్పించి అనంతరం ఇంద్రమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఏఎంసీ చైర్మన్ కంబాలపల్లి గురునాథరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ పాండురంగ రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు నీళ్ల భాను గౌడ్, రాందాస్ నాయక్, ఏఎంసీ వైస్ చైర్మన్ మంకాల కరుణాకర్, డైరెక్టర్లు తాళ మహేష్ గౌడ్, డి రాజు, సుబ్బురు మల్లిక, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ గౌస్ బాషా, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఈసి శేఖర్ గౌడ్ మామ, కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, రాచర్ల వెంకటేశ్వర్లు, ముత్యాల రాజశేఖర్ రావు, మంకాల దాసు, సుబ్బురు పాండు, దారు రాఘవేందర్, జగన్నాథం, ఇబ్రహీంపట్నం మండలం పార్టీ అధ్యక్షులు రావణమోని లింగం, అయాన్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.




## జీహెచ్ఎంసీ శంషాబాద్ జోనల్ కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు...

**రాజేంద్రనగర్ మహా ;** జీహెచ్ఎంసీ శంషాబాద్ జోనల్ కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శంషాబాద్ జోనల్ కార్యాలయంలో మంగళవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలో జిహెచ్ఎంసి అధికారులు, సిబ్బందితో కలిసి జోనల్ కమిషనర్ చంద్రకళ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో శంషాబాద్ సర్కిల్ 18 డిప్యూటీ కమిషనర్ బి సుమన్ రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ సుష్మా రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**రాజేంద్రనగర్ మహా ;** అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం తెలంగాణ 13 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ జాతీయ జెండాను ఆవిష్కరించి ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన సుదీర్ఘ ఉద్యమంలో తమ ప్రాణాలను అర్పించిన అమరవీరులను సందర్భంగా స్మరించుకుంటూ వారికి ఘన నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోట్లాది ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపమని అనేక త్యాగాలు, పోరాటాల ఉద్యమ ఫలితంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భవించిందని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రేమదాసు గౌడ్, ప్రేమ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు ధనంజయ్,సీనియర్ నాయకులు సోమా శ్రీనివాస్, భాషా శ్రీనివాస్, సరికొండ వెంకటేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.



## 13వ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు...

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ పోలీస్ స్టేషన్ లో ఆవరణలో సీఐ ఆధ్వర్యంలో ఏసిపి శ్రీకాంత్ గౌడ్ మంగళవారం 13వ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సిబ్బందికి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఎసిపి శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ ఎంతోమంది అమరులు త్యాగ ఫలితమే నేడు తెలంగాణ ఏర్పాటు అయిందన్నారు. సాధించుకున్న తెలంగాణను భద్రంగా కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలోపోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అమరుల స్ఫూర్తితో ఉద్యమ ఆకాంక్షలకనుగుణంగా పాలన...

- తెలంగాణ రాష్ట్రావతరణ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే...
- ఇబ్రహీంపట్నం క్యాంపు కార్యాలయంలో జాతీయ పతాకావిష్కరణ...



**ఇబ్రహీంపట్నం జూన్ 2 మహా:** తెలంగాణ సాధన కోసం అసువులు బాసిన అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమ ఆకాంక్షలకనుగుణంగా, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన సాగుతోందని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్రావతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో జరిగిన వేడుకల్లో జిల్లా ఇంఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. జాతీయ జెండావిష్కరణ అనంతరం, పోలీసుల గౌరవవందనం, లబ్ధిదారులకు చెక్కులపంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ లో వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రితో కలిసి పరిశీలించారు. కలెక్టరేట్ కార్యక్రమం అనంతరం, ఇబ్రహీంపట్నంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మల్ రెడ్డి .... రాష్ట్రావతరణ వేడుకల్లో పాల్గొన్నారు. క్యాంపు కార్యాలయంపై మువ్వన్నెల జెండాను ఎగురవేసి, అమరులకు నివాళులర్పించారు. ఆనాడు సోనియా గాంధీ సంకల్పంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే... నేడు రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో పునఃనిర్మాణం జరుగుతోందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఏసిపి కెపివి రాజు, సిఐలు మహేందర్ రెడ్డి, మధు, ఎస్ఐలు, ఏఎంసీ చైర్మన్ గురునాథ్ రెడ్డి టీఎస్ చైర్మన్ పాండురంగ రెడ్డి స్థానిక కౌన్సిలర్లు నీళ్ల భాను గౌడ్, రాందాస్ నాయక్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈసీ శేఖర్ గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి, రాజశేఖర్ రావు, మంకాల దాసు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు

**సంక్షేమ పథకాలే ప్రభుత్వ లక్ష్యం**
**సొసైటీ చైర్మన్ దుగ్గినేని**

**కారేపల్లి , మహా:** అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు అవుతాయని సంక్షేమ పథకాల అమలే ప్రభుత్వ లక్ష్యమని సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు అన్నారు.సింగరేణి మండల పరిధిలోని గేట్ కారేపల్లిలో మంగళవారం నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ గృహప్రవేశాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దుగ్గినేని శ్రీనివాసరావు, ఎంపీడీవో మల్లెల రవీంద్ర ప్రసాద్, హౌసింగ్ ఏఈ నాగేంద్రబాబులు హాజరై వారి చేతుల మీదుగా కొండ సుమలత, మేడబోయినా లక్ష్మి, మర్రి జయమ్మ, కుర్ర నిర్మలలు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ గృహ ప్రవేశాలు నిర్వహించారు. సింగరేణి మండలంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రామదాసు నాయక్ కృషితో పేదల సొంతంటి కల నెరవేరింది అన్నారు.

పేదలకు రెండో విడత ఇందిరమ్మ ఇల్లు కూడా మంజూరు అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుడిపూడి తిరుమల రావు సర్పంచ్ పూసం ఎల్లయ్య, ఉప సర్పంచ్ కందుల సామెల్, పంచాయతీ కార్యదర్శి కె. అనూష, గేటు కారేపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సాయిని తిరుపతయ్య,చెరుకూరి వెంకటేశ్వర్లుఅంగన్వాడి ఉపాధ్యాయులు, వార్డు మెంబర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పాలకుర్తిలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**పాలకుర్తి,జూన్ 2 మహా:** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి గ్రామ పంచాయతీ ఆవరణలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గ్రామ సర్పంచ్ పెద్దపెల్లి తిరుమల అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ అమర వీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెద్దపెల్లి తిరుమల మాట్లాడుతూ,దశాబ్దాల సుదీర్ఘ పోరాటం, ఎందరో అమరవీరుల బలిదానాల ఫలితంగా 2014, జూన్ 2న భారత దేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించింది. ఆ మహనీయుల త్యాగాలను మనం ఎప్పటికీ మరువకూడదు,అని పేర్కొన్నారు. తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఈ వేడుకలను నిర్వహించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వైద బుగ్గ రామస్వామి, కార్యదర్శి ప్రదీప్ గ్రామ పాలకవర్గ సభ్యులు, అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## ఎన్‌టిపిసి కాంట్రాక్టు కార్మికుల మెడికల్ చెకప్ పేరుతో వేధింపులు

**నిరసన తెలిపిన జేఏసీ**

రామగుండం మే 2 పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం ఎన్‌టిపిసిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులను మెడికల్ చెకప్ పేరుతో యాజమాన్యం తీవ్ర వేధింపులకు గురి చేస్తోందని ఆరోపిస్తూ, జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ క్రమంలో కార్మికుల మెడికల్ చెకప్‌ను తక్షణమే నిలిపివేయాలని కోరుతూ ఎన్‌టిపిసి ధన్వంతరి హాస్పిటల్ CMO కి జేఏసీ నాయకులు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. మెడికల్ చెకప్ పేరుతో కాంట్రాక్టు కార్మికుల పట్ల యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరు సరికాదని, ఇది కార్మికులను ఇబ్బందులకు గురిచేసేలా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులను కాలరాసే ఇటువంటి చర్యలను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు నాంసాని శంకర్, చిలుక శంకర్, గీట్ల లక్ష్మారెడ్డి, బూమల్ల చందర్, దగ్గుల సత్యం, చింతల సత్యం, ఇజ్జగిరి భూమయ్య, దండపాణి శ్రీనివాస్, ఆలేటి శ్రీనివాసు, జమీల్ భాయ్, శంకరు పురుషోత్తం, డి. కృష్ణమూర్తితో పాటు పెద్ద సంఖ్యలో కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.





# ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ కార్యాలయంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- జెండావిష్కరణ చేసిన జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి

**ఇబ్రహీంపట్నం జూన్ 2 మహా**:తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కేంద్రంలోని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, స్థానిక చైర్మెన్, కౌన్సిలర్లు, నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి జాతీయ జెండాతో పాటు భారత రాష్ట్ర సమితి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచుకొని జిల్లా, నియోజకవర్గ ప్రజలకు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధన ఒకరోజులో జరిగిన ప్రక్రియ కాదని, అది కోట్లాది ప్రజల ఆకాంక్షలు, లక్షలాది మంది ఉద్యమకారుల త్యాగాలు, ముఖ్యంగా తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు దూరదృష్టి, అంచలంచెల సంకల్పం, నిరంతర పోరాట ఫలితమని పేర్కొన్నారు."తెలంగాణ అంటే కేవలం ఒక భౌగోళిక ప్రాంతం కాదు.. అది స్వాభిమానం, స్వయం ప్రతిపత్తి, స్వీయ గౌరవానికి ప్రతీక. తెలంగాణ రాష్ట్రం సాధించి, అభివృద్ధి పథంలో నిలిపిన ఘనత కేసీఆర్ దే" అని అన్నారు. తెలంగాణ కోసం పోరాడిన అమరవీరులను స్మరించుకుంటూ, రాష్ట్ర అభివృద్ధి, ప్రజల ఆత్మగౌరవ పరిరక్షణలో బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ నాయకులు కర్నాటి రమేష్ గౌడ్, చీరాల రమేష్, మడుపు వేణుగోపాలరావు, జర్కోని రాజు, మడుపు శివసాయి, మున్సిపల్ చైర్మన్ పేర్ల సుదర్శన్ రెడ్డి, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణ

- మంత్రి శ్రీధర్ బాబు
- నంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- అన్ని వర్గాల ప్రజల సంక్షేమం రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యం
- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా విద్యార్థులు ప్రదర్శనలు




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్‌లోని సమీకృత జిల్లా కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు పోలీసులు గౌరవ వందనం సమర్పించగా, జిల్లా యంత్రాంగం తరపున ఘన స్వాగతం పలికారు. అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి మంత్రి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలనుద్దేశించి మంత్రి మాట్లాడుతూ... అన్ని వర్గాల ప్రజల సంక్షేమం మరియు రాష్ట్ర సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరుల ఆశయాల సాధనే వారికి నిజమైన నివాళి అని అన్నారు. జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో అమలు అవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మరియు సాధించిన ప్రగతిని వివరించారు.అమరవీరుల కుటుంబాలకు సన్మానం....తెలంగాణ ఉద్యమ అమరవీరుల కుటుంబ సభ్యులను మంత్రి ఆప్యాయంగా పలకరించి సన్మానించారు. ఉద్యమ అమరవీరుల వారి త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు.

**స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక సహాయం...**

ల్లాలోని 672 స్వయం సహాయక సంఘాలకు రూ.57 కోట్ల 38 లక్షల విలువైన చెక్కును మంత్రి అందజేశారు. అదేవిధంగా ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్ సంస్థల అభివృద్ధి పథకం (PMFME) కింద యాచారం మండలంలోని రెండు యూనిట్లకు రూ.4.27 లక్షల ఆర్థిక సహాయ చెక్కులను పంపిణీ చేశారు.

**ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు**

రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా విద్యార్థులు ప్రదర్శనలు ఇచ్చి సభికులను ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబరిచిన చిన్నారులకు మంత్రి మెమెంటోలు అందజేసి అభినందించారు.

**అమరవీరుల స్మారక స్థూపం వద్ద నివాళులు...**

అంతకుముందు కలెక్టరేట్ ఆవరణలోని తెలంగాణ అమరవీరుల స్మారక స్థూపం వద్ద మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, కాలే యాదయ్య, రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, శంషాబాద్ డీసీపీ,అదనపు కలెక్టర్లు చంద్రా రెడ్డి, కిరణ్మయి, డీఆర్ఓ శారద తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అమరవీరుల త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం నేడు అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం మరింత ప్రగతి సాధిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.

**ప్రభుత్వ శాఖల స్టాల్స్ సందర్శన....**

రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాల్స్‌ను మంత్రి సందర్శించి, శాఖల పనితీరు మరియు ప్రజలకు అందిస్తున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థల చైర్మన్ మధుసూదన్ రెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, కాలే యాదయ్య, జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, కిరణ్మయి, డీఆర్ఓ శారద, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్ రెడ్డి, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు

**గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి, జిల్లా కలెక్టర్**

**మహా వరంగల్ బ్యూరో :** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం వరంగల్ తూర్పు నియోజక వర్గం పరిధిలో ని 21, 32వ, డివిజన్లలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు గద్దల స్రవంతి, కిన్నర సుశీల వీరు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని రిబ్బన్ కట్ చేసి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈసందర్భంగా గృహప్రవేశం చేసిన దంపతులకు నూతన వస్త్రాలను మంత్రి బహుకరించారు.ఇందిరమ్మ పథకం లో ఎంపికైన లబ్ధిదారులకు సొంత ఇంటి కల నెరవేరడం ఆనందదాయకమని లబ్ధిదారులు పేర్కొన్నారు.

ఈ గృహప్రవేశ కార్యక్రమంలో జెడ్పి సి ఓ రాంరెడ్డి, సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

# మలిదశ ఉద్యమకారులకు ఘన సన్మానం

**తెలంగాణ రక్షణ సేన పార్టీ**

**ఆలేరు జూన్ 2 మహా :** జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం తెలంగాణ మలిదశ ఉద్యమకారులు ఎర్ర జాన్సన్, పూల నాగయ్య, తమ్మిడి పద్మారావు, మొగుళ్ళ దేశాయి రెడ్డి, ఆడెపు బాలస్వామి,మందుల విజయలను తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపు మేరకు ఆలేరు నియోజకవర్గ ఇన్చార్జ్ కందడి మణిపాల్ రెడ్డి పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు....

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు ఫ్రెండ్స్ క్లబ్ లోజరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా తెలంగాణ అమరవీరుల స్థూపంతో పాటు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, తెలంగాణ ఉద్యమ రథసారథి ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాలకు మలిదశ ఉద్యమకారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు...

ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన ఆలేరు నియోజకవర్గ ఇన్చార్జ్ కందడి మనిపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం 1997 నుండి అనేక కష్ట, నష్టాలను ఓర్చి ఉద్యమించి రాష్ట్రాన్ని సాధించి ఇలాంటి ఫలాలను పొందని ఉద్యమ నాయకులను గుర్తించి ఘనంగా సన్మానించాలనే కవితక్క పిలుపు మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు రాజకీయాలకు అతీతంగా నిజాయితీగల ఉద్యమ నాయకులను గుర్తించడంలో అప్పటి కెసిఆర్ ప్రభుత్వం, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా రేవంత్ సర్కార్ నిజమైన నిజాయితీగల ఉద్యమకారులను గుర్తించి స్వతంత్ర సమరయోధులుగా గుర్తించి పింఛన్, హెల్త్ కార్డు, 250 గజాల ప్లాటు ఇచ్చి గౌరవించాలని ఆయన డిమాండ్ చేశారు.



# ఇందిరమ్మ గృహ ప్రవేశాలలో ప్రభుత్వ సలహాదారు

**ఆదిలాబాద్ మహా :** నిరుపేదల సొంతింటి కల నెరవేర్చడమే తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని 42వ వార్డు రిక్షా కాలనీలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల కార్యక్రమంలో ఆయన జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఇతర అధికారులు ,అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారులు బైష్ ఠాకూర్ మంగళ, గణపత్ వార్ దేవమ్మవసంత్ రావుల గృహాలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా విడతల వారీగా లబ్ధిదారులకు 5 లక్షల రూపాయలను అందజేస్తుందని వివరించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి అయిన ఖర్చు వివరాలను తెలుసుకొని వారికి శుభాకాంక్షలు తెలిపి నూతన వస్త్రాలను బహూకరించారు.

# పరకాల పట్టణాన్ని ఎడ్యుకేషన్ హబ్ గా తీర్చిదిద్దుతాం

**కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట**



**మహా వరంగల్ బ్యూరో;**పరకాల పట్టణ కేంద్రంలోని రాజుపేట లో నూతనంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి, పనులు నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.విద్యారంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని,ఈ పాఠశాల ద్వారా స్థానిక విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలతో కూడిన విద్య అందుబాటులోకి వస్తుందని తెలిపారు.నిర్మాణ పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా,సమయానికి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని అన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు మేమే చేస్తామని అన్నారు.

అనంతరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనుల పరిశీలిన గీసుగొండ మండలం కొనయమాకుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణ పనులను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు.అనంతరం ప్రాజెక్టు పనుల పురోగతిని పరిశీలించి,నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ రైతులకు సాగునీటి సమస్యలు లేకుండా చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కొనయమాకుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తయితే పరిసర ప్రాంతాల రైతులకు సాగునీరు అందుబాటులోకి వచ్చి వ్యవసాయాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు.ప్రాజెక్టు నిర్మాణంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పనులు చేపట్టాలని, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు.

# ఘనంగా రాష్ట్రావతరణ వేడుకలు

- జాతీయ జెండా ఆవిష్కరించిన మహ్మద్ అలీ షబ్బీర్
- అమరుల త్యాగాలను స్మరించుకున్న నేతలు,అధికారులు
- ఆదిలాబాద్ పై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని వెల్లడి



**ఆదిలాబాద్ మహా :** రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.పోలీస్ ల గౌరవ వందనాన్ని స్వీకరించి జాతీయ పతాకావిష్కరణ గావించారు. ఉద్యమ సమయంలో అమరులు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని స్మరించుకున్నారు.అమరవీరుల త్యాగాల ఫలితంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాకారమైందని అన్నారు. తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ.. పక్క రాష్ట్రాలతోనే కాకుండా అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడుతోందని తెలిపారు. విద్యతో పాటు నైపుణ్య శిక్షణ రంగాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆయన వివరించారు. ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజా పాలన గావిస్తోందన్నారు. ఉమ్మడి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని అన్నారు. ఆదిలాబాద్ అంటే సీఎంకు ప్రత్యేక అభిమానం, ప్రేమ ఉందన్నారు. అందుకే ఏ కార్యక్రమమైనా జిల్లా నుంచే సీఎం ప్రారంభిస్తున్నారని తెలిపారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం ఉమ్మడి జిల్లా నుంచే శ్రీకారం చుట్టారన్నారు. అంతకుముందు ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద, కలెక్టరేట్ ప్రాంగణంలోని అమరవీరుల స్థూపం వద్ద, తెలంగాణ చౌక్ లోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.రెండవ విడత ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాలు అందించారు. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల పథకంలో పురోగతిని సాధించడంలో కృషి చేసిన వారికి ప్రసంశా పత్రాలను అందజేశారు. స్వయం ఉపాధి కోసం సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక పునరావాస పథకంలో భాగంగా ఇద్దరు ట్రాన్స్ జెండర్లకు ఒక్కొక్కరికి 75 వేల రూపాయల చొప్పున చెక్కులను పంపిణి చేశారు. కొత్తగా మీసేవా కేంద్రాల నిర్వహణకు ఎంపికైన ఐదుగురికి మీ సేవా కేంద్రాల మంజూరి పత్రాలను అందజేశారు.సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 13 మంది దివ్యాంగులకు సుమారు 7 లక్షల రూపాయల విలువ చేసే ఉపకరణాలను ఉచితంగా పంపిణి చేశారు. ఇందులో మొబైల్ బ్యాట్రీ ట్రై సైకిళ్లు ఉన్నాయి. అనంతర కలెక్టర్ సమావేశ మందిరంలో సిఎంకప్ విజేతలను సన్మానించి, ప్రోత్సాహకంగా 10 వేల రూపాయలను ప్రభుత్వ విప్ అందజేశారు. తెలంగాణగా రాష్ట్ర ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను ఘనంగా సన్మానించారు.

# ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

**జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన వరంగల్ సీపీ**

మహా వరంగల్ బ్యూరో;తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను వరంగల్ పోలీస్ కమిషనర్ కాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి అదనపు డీసీపీ రవి ముఖ్యఅతిథిగా హాజరై పోలీస్ కమిషనరేట్ కార్యాలయం అవనిలో జాతీయ జెండాను ఎగరవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం అధికారులు సిబ్బంది చిన్నారులకు మిఠాయిలను పంపిణీ చేసి రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఏ. ఆర్ అదనపు డీపీపీ సురేష్, ఏసీపీలు నాగయ్య, డేవిడ్ రాజు, పరిపాలనాదికారి సంపత్ కుమార్తో పాటు ఇన్స్పెక్టర్లు, ఆర్. ఐలు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, పరిపాలన పాలన సిబ్బంది పాల్గొన్నారు.



# తెలంగాణ అమర వీరులకు నివాళులర్పించిన వరంగల్ సీపీ

మహా వరంగల్ బ్యూరో;తెలంగాణ సాధనకై తమ త్యాగాలు చేసిన తెలంగాణ అమరవీరులకు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ హనుమకొండ అదాలత్ సెంటర్ లోని తెలంగాణ అమరవీరుల స్థూపం చేరుకొని స్థూపం వద్ద వద్ద పూలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ అమరవీరుల త్యాగాలను మరువద్దని, వారి ఆశయ సాధనకై మనమందరం కలిసి పనిచేస్తూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



# అమరవీరులకు ఘన నివాళి

- మంత్రి కొండా సురేఖ, జిల్లా కలెక్టర్
- తూర్పులో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
- లబ్ధిదారులకు ఆస్తులు, ఆర్థిక సహాయం పంపిణి



**మహా వరంగల్ బ్యూరో;**తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ తూర్పు నియోజక వర్గం లోని ఖిలా వరంగల్ ఖుష్‌మహల్ ప్రాంగణంలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమెతో పాటు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, డీసీపీ అంకిత్ కుమార్, డి ఎఫ్ ఓ నిఖిత అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి నివాళులర్పించారు.అనంతరం ఖుష్‌మహల్‌లో నిర్వహించిన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొని పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పతాకావిష్కరణ చేసి జిల్లా ప్రగతి సందేశాన్ని ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా అమరవీరుల కుటుంబాలను, స్వాతంత్ర్య సమరయోధులను మంత్రి సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం వివిధ శాఖల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఆస్తులు, ఆర్థిక సహాయం పంపిణీ చేశారు. అలాగే వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి కొండా సురేఖ, జిల్లా కలెక్టర్, డీఎఫ్‌వో నిఖిత, అదనపు కలెక్టర్లు, ఇతర అధికారులు పరిశీలించారు.

**స్వయం సహాయక సంఘాలకు రూ.12 కోట్ల బ్యాంక్ లింకేజీ**

రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పీడీ మెప్మా విభాగం ద్వారా 102 స్వయం సహాయక సంఘాలకు రూ.12 కోట్ల విలువైన బ్యాంక్ లింకేజీ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు.డిఆర్డిఏ శాఖ ఆధ్వర్యంలో 4 బ్యాంక్ లింకేజీ చెక్కులను అందజేయడంతో పాటు, స్నేహ గ్రూపులకు 11 సైకిళ్లను పంపిణీ చేశారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్లకు రూ.75 వేల చొప్పున మొత్తం 8 సబ్సిడీ చెక్కులను అందజేశారు.

**విద్య, పర్యావరణ రంగాల్లో ప్రతిభకు గుర్తింపు**

డీఆర్డీఎ శాఖ ద్వారా వయోజన విద్యకు సంబంధించిన 'ఉల్లాస్' సర్టిఫికేట్లను లబ్ధిదారులకు అందజేశారు. కాలుష్య నియంత్రణ మండలి నిర్వహించిన సమ్మర్ క్యాంపుల్లో పర్యావరణ పరిరక్షణలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలు అందించారు. జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందిస్తూ ప్రశంసా పత్రాలు బహుకరించారు.

**లబ్ధిదారులకు పత్రాల కేటాయింపు**

ఇందిరమ్మ ఇండ్ల' పథకం రెండవ విడతలో ఇద్దరు లబ్ధిదారులు, అలాగే, డబుల్ బెడ్ రూమ్ ఒక్కరికి ప్లాట్ల పంపిణీ'లో ఒక్కరిని లబ్ధిదారుని గా ఎంపిక చేసి కేటాయింపు పత్రాలు మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రిగారు సందర్శించారు. ఈ కార్యక్రమానికి సంబంధిత శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు ప్రజలు పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి హాజరై ఘనంగా నిర్వహించడం జరిగింది.

**కలెక్టరేట్ లో పతాకావిష్కరణ**

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. పోలీసు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు జి. సంధ్యారాణి, వై.వి. గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ ఏరోస్పేస్ రంగంపై మహీంద్రా కన్ను

ఏరోస్పేస్ రంగంలో భారతీయ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) దూసుకుపోతున్నట్లు చెప్పింది. విమానాల తయారీలో అంతర్జాతీయంగా ఎదురవుతున్న సరఫరాగొలుసు (సప్లైచైన్) లోపాలను అధిగమించడానికి, గ్లోబల్ ఏరోస్పేస్ మార్కెట్‌లో వ్యూహాత్మక కొనుగోళ్లు జరపడంపై కంపెనీ దృష్టి సారించింది. ఈ విషయాన్ని గ్రూప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ), మేనేజింగ్ డైరెక్టర్ అనీష్ షా అధికారికంగా వెల్లడించారు. ప్రస్తుతం అంతర్జాతీయంగా విమాన డెలివరీలు ఆలస్యం కావడానికి ప్రధాన కారణం సప్లైచైన్ నెట్‌వర్క్‌లో తలెత్తుతున్న అంతరాయాలేనని కంపెనీ చెప్పింది. ఈ అడ్డంకులను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించాల్సిందిగా గ్లోబల్ ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ తయారీదారులు (ఓఈఎం) మహీంద్రా గ్రూప్‌ను సంప్రదించారని అనీష్ షా స్పష్టం చేశారు.

ఇటీవల జరిగిన కంపెనీ ఆదాయాల వెల్లడి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'ప్రస్తుతం గ్లోబల్ ఓఈఎంలు కేవలం ఆర్డర్ల కోసమే కాకుండా మా సామర్థ్యాన్ని నమ్మి వస్తున్నాయి. మేము అత్యుత్తమ నాణ్యతను అందిస్తామని, మా ఉత్పాదక పరిధిని మరింత విస్తరించమని కోరుతున్నారు. ప్రస్తుతం చాలా కంపెనీలు సరఫరా పరంగా సవాళ్లను ఎదుర్కొంటున్నాయి' అన్నారు. పరిశ్రమ వర్గాల విశ్లేషణల ప్రకారం.. అనీష్ షా పేర్కొన్న ఆ గ్లోబల్ ఓఈఎం.. అంతర్జాతీయ విమాన తయారీ దిగ్గజం ఎయిర్‌బస్ అనేలా అంచనాలున్నాయి. గత కొద్దికాలంగా మహీంద్రా ఏరోస్ట్రక్చర్స్‌తో ఎయిర్‌బస్ తన వ్యాపారం భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తోంది.




# భారమవుతున్న కృత్రిమ మేధ!

ఉత్పాదకతను పెంచడంలో, మానవ శ్రమను తగ్గించడంలో కృత్రిమ మేధ (ఏఐ) చాలా ఉపయోగపడుతోందన్న మాట వాస్తవమే. అందుకే ప్రపంచవ్యాప్తంగా అగ్రశ్రేణి కంపెనీలన్నీ తమ ఉద్యోగులకు ఏఐ సాధనాలను అందిస్తూ వచ్చాయి. అయితే, ఇప్పుడు సీన్ రివర్స్ అవుతోంది. అపరిమిత ఉత్పాదకతను ఆశ చూపిన ఏఐ, ఇప్పుడు కంపెనీల బడ్జెట్‌లకు తూట్లు పొడుస్తోంది. దీంతో మైక్రోసాఫ్ట్, అమెజాన్, ఉబెర్ వంటి గ్లోబల్ టెక్ దిగ్గజాల దారిలోనే.. ప్రపంచంలోనే అతి పెద్ద రిటైల్ నెట్‌వర్క్ అయిన వాల్‌మార్ట్ కూడా తమ ఉద్యోగుల ఏఐ వినియోగంపై ఆంక్షలు విధిస్తుంది.



### 'కోడ్ పప్పీ'కి బ్రేకులు

బ్లూమ్‌బెర్గ్ తాజా నివేదిక ప్రకారం.. వాల్‌మార్ట్ తన అంతర్గత కార్పొరేట్ పనుల కోసం రూపొందించుకున్న 'కోడ్ పప్పీ' అనే ఏఐ అసిస్టెంట్ వినియోగంపై పరిమితులు విధించింది. ఇది ఉద్యోగులకు ప్రెజెంటేషన్లు తయారు చేయడం, డేటా స్ప్రెడ్‌షీట్‌లను నింపడం వంటి రోజువారీ పనులను చిటికెలో చేసిపెట్టే ఏఐ ఏజెంట్. గతంలో వాల్‌మార్ట్ ఉద్యోగులు దీనిని అపరిమితంగా వాడేవారు. ఉద్యోగుల నుంచి దీనికి డిమాండ్ పెరగడంతో కంపెనీకి బిల్లులు తడిసి మోపెడయ్యాయి. దీంతో అప్రమత్తమైన యాజమాన్యం ఇకపై ఉద్యోగులకు టోకెన్ పరిమితి విధించాలని నిర్ణయించింది.

### టోకెన్ పరిమతి అంటే ఏమిటి?

ఏఐ భాషలో టోకెన్ అనేది ఒక కొలమానం. మనం ఏఐకి ఇచ్చే ప్రాంప్ట్‌లు (ప్రశ్నలు) అది ఇచ్చే సమాధానాల పొడవును బట్టి టోకెన్లు ఖర్చవుతాయి. ఎంత ఎక్కువ పని చేస్తే అంత ఎక్కువ టోకెన్లు వినియోగమవుతాయి. అంటే.. ఇకపై వాల్‌మార్ట్ ఉద్యోగులు లెక్క చూసుకుని మరీ ఏఐని వాడాల్సి ఉంటుంది.ఈ విషయంపై వాల్‌మార్ట్ ప్రతినిధి స్పందిస్తూ.. ఉద్యోగులు ఏఐని కేవలం కాలక్షేపానికి కాకుండా కంపెనీకి విలువను చేకూర్చే పనులకు మాత్రమే వాడాలని, సరైన పని కోసం సరైన ఏఐ సాధనాన్ని ఎంచుకోవాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం వాల్‌మార్ట్ సిబ్బందికి కోడ్ పప్పీతో పాటు క్లాడ్, చాట్‌జీపీటీ వంటి ఇతర సాధనాల యాక్సెస్ కూడా ఉంది.

### ఉబెర్, మైక్రోసాఫ్ట్ కంపెనీలకూ తప్పని తిప్పలు

ఖర్చులు పెరుగిపోతున్న ఉదంతాన్ని బహిరంగంగా అంగీకరించిన సంస్థల్లో రైడ్‌హెయిలింగ్ దిగ్గజం ఉబెర్ ముందు వరుసలో ఉంది. ఈ ఏడాది జనవరిలో ఉబెర్ తన 5,000 మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకు 'క్లాడ్ కోడ్' యాక్సెస్ ఇచ్చింది. అయితే, కేవలం కొన్ని నెలల వ్యవధిలోనే ఆ ఏడాది మొత్తానికి కేటాయించిన ఏఐ బడ్జెట్ అంతా ఖర్చయిపోవడంతో యాజమాన్యం నివ్వెరపోయింది.

# ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలి.. ఎప్పుడు 'నో' చెప్పాలి?

**ప్రపంచంలోనే అత్యంత విజయవంతమైన పెట్టుబడిదారుడు ఎవరు? అంటే.. తప్పకుండా దీనికి సమాధానం 'వారెన్ బఫెట్' అనే చెబుతారు. ఆర్థిక సంక్షోభం సమయంలో కూడా నష్టాలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకునే ఈయన.. ఇప్పటికీ ఎంతోమందికి మార్గదర్శం. ఇన్వెస్టర్‌గా బఫెట్ సాధించిన విజయాల కంటే.. ఎప్పుడు నో చెప్పాలో తెలిస్తే తప్పకుండా వ్యాపార సామ్రాజ్యాన్ని కాపాడుకోవచ్చని ఆయన బలంగా విశ్వసిస్తారు.**

తాను పూర్తిగా అర్థం చేసుకోలేని వ్యాపారంలో పెట్టుబడి పెట్టకూడదని వారెన్ బఫెట్ చెబుతారు. ఈ క్రమశిక్షణే 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభ సమయంలో ఆయనను నష్టాల నుంచి కాపాడింది.2008 సెప్టెంబర్‌లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో పడింది. దిగ్గజ సంస్థలు సైతం దివాలా అంచుకు చేరుకున్నాయి. ఆ సమయంలో ఏఐజీ, లెహ్మాన్ బ్రదర్స్ సంస్థలు ఆర్థిక సహాయం కోసం బఫెట్‌ను సంప్రదించాయి. అయితే బఫెట్ ఆ సంస్థల ఆర్థిక పరిస్థితిని, వ్యాపార నమూనాను, రిస్కులను పూర్తిగా పరిశీలించిన తరువాత సహాయం చేయడానికి నిరాకరించారు. ఆ తరువాత లెహ్మాన్ బ్రదర్స్ సంస్థ దివాలా తీసింది. ఒకవేళా బఫెట్ ఆ కంపెనీలలో పెట్టుబడులు పెట్టి ఉంటే.. ఆయన కూడా ఆ నష్టాల్లో భాగస్వామి కావాల్సి వచ్చేది. ముందుగానే ఆలోచించి ఇన్వెస్ట్ చేయడానికి నిరాకరించారు. దీన్ని బట్టి చూస్తే బఫెట్ తీసుకున్న నిర్ణయాలు ఎంత సరైనవో స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు.

### అర్థం అయ్యే వ్యాపారాల్లోనే పెట్టుబడి పెట్టాలి

ఏ వ్యాపారం ఎలా డబ్బు సంపాదిస్తుందో, దాని భవిష్యత్తు ఏమిటో, దాని రిస్కులు ఏమిటో అర్థం కాకపోతే ఆ కంపెనీలో పెట్టుబడి పెట్టకూడదు. కేవలం ఇతరులు కొనుగోలు చేస్తున్నారని లేదా షేర్ ధర పెరుగుతోందని పెట్టుబడి పెట్టడం ప్రమాదకరం.



### లిక్విడిటీ (నగదు లభ్యత) చాలా ముఖ్యం:

కొన్ని కంపెనీలు లాభదాయకంగా కనిపించినా.. తక్షణ అవసరాలకు సరిపడా నగదు లేకపోతే సమస్యల్లో పడవచ్చు. అందువల్ల పెట్టుబడిదారులు కంపెనీ నగదు నిల్వలు, అప్పుల స్థాయి, చెల్లింపుల సామర్థ్యాన్ని తప్పనిసరిగా పరిశీలించాలి.

### సంక్షోభంలో ఉంటే జాగ్రత్త అవసరం:

కొన్నిసార్లు ఒక కంపెనీ సమస్య మొత్తం రంగానికే వ్యాపిస్తుంది. దీనిని కాంటేజియన్ ఎఫెక్ట్ అంటారు. ఒక కంపెనీ కుప్పకూలితే.. అదే రంగంలోని ఇతర కంపెనీలు కూడా ప్రభావితమవుతాయి. కాబట్టి ఇలాంటి పరిస్థితుల్లో పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టడం ప్రమాదకరం.

### నమ్మకం ప్రధానం:

ప్రత్యేకించి బ్యాంకులు, ఫైనాన్షియల్ సంస్థలు ప్రజల నమ్మకంపై ఆధారపడి ఉంటాయి. ఒకసారి పెట్టుబడిదారులు లేదా వినియోగదారులు నమ్మకం కోల్పోతే ఆ సంస్థ మనుగడే ప్రమాదంలో పడుతుంది. అందువల్ల పారదర్శకత, నిజాయితీ, మంచి యాజమాన్యం ఉన్న కంపెనీలను ఎంచుకోవాలి.

### బలమైన కంపెనీలకే మూలధనం:

ఆర్థికంగా బలమైన కంపెనీలు కష్టకాలంలో కూడా పెట్టుబడిదారుల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటాయి. బ్యాంకులు, పెట్టుబడిదారులు, మార్కెట్ వాటికి సహకరించడానికి సిద్ధంగా ఉంటాయి. అందుకే దీర్ఘకాలికంగా సంపద సృష్టించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

### వారెన్ బఫెట్ ప్రకారం..

ప్రతి అవకాశాన్ని అందుకోవడం కంటే, సరైన అవకాశాన్ని మాత్రమే ఎంచుకోవడం పెట్టుబడిలో విజయం సాధించే మార్గం. కొన్నిసార్లు 'నో' అని చెప్పడం కూడా మంచి పెట్టుబడి నిర్ణయమే అవుతుంది. ''స్పష్టత, క్రమశిక్షణ, ప్రాథమిక విశ్లేషణ, సహనం'' ఇవే విజయవంతమైన పెట్టుబడిదారుడి అసలైన ఆయుధాలు.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# గూగుల్ కంపెనీ భారీ ప్రయోగం

***సాధారణంగా గూగుల్ అంటే సెర్చ్ ఇంజిన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అత్యాధునిక టెక్నాలజీ గుర్తుకొస్తాయి. కానీ ఇప్పుడు అదే గూగుల్ ప్రపంచాన్ని ఇబ్బంది పెడుతున్న ఓ ప్రమాదకరమైన ప్రజారోగ్య సమస్యపై దృష్టి సారించింది. 'ముల్లును ముల్లుతోనే' దెబ్బ తీసేలా కొత్త వ్యూహంతో ముందుకొచ్చింది. ఈ వినూత్న ప్రయోగం.. వినడానికి ఆశ్చర్యంగా అనిపించినా దాని వెనుక ఉన్న శాస్త్రం, దాని లక్ష్యం, గతంలో నమోదైన ఫలితాలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.***

గూగుల్ మాతృసంస్థకు చెందిన పరిశోధనా విభాగం డీబగ్ ప్రాజెక్ట్ అమెరికాలోని ఫ్లోరిడా, కాలిఫోర్నియా రాష్ట్రాల్లో భారీ ప్రయోగానికి సిద్ధమైంది. రెండు సంవత్సరాల వ్యవధిలో ఇక్కడ 3.2 కోట్ల మగ దోమలను విడుదల చేయడానికి అనుమతి కోరింది. అమెరికా పర్యావరణ పరిరక్షణ సంస్థ ప్రస్తుతం ఈ ప్రతిపాదనను పరిశీలిస్తోంది.

అయితే ఇవి సాధారణ దోమలు కావు. ప్రత్యేకంగా ల్యాబ్‌ల్లో పెంచినవి!. పైగా వోల్బాషియా పైపెంటిస్ అనే బ్యాక్టీరియాతో సంక్రమింపజేసిన మగ దోమలు. ఈ మగ దోమలు అడవిలో ఉన్న ఆడ దోమలతో జతకట్టినప్పుడు గుడ్లు ఏర్పడతాయి. కానీ ఆ గుడ్లు పొదగవు. ఫలితంగా కొత్త దోమలు పుట్టవు. అలా.. కొంతకాలానికి మొత్తం దోమల జనాభా క్రమంగా తగ్గిపోతుంది.

ఇక్కడ మరో ఆసక్తికర విషయం ఏమిటంటే.. కుట్టేది ఆడ దోమలే. మగ దోమలు మనుషుల జోలికి పోవు . కాబట్టి లక్షలాది దోమలను విడుదల చేసినా ప్రజలకు అదనపు ఇబ్బంది ఉండదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అలాగని.. ఈ ప్రాజెక్ట్ కొత్తది కాదు. గూగుల్ 2014లోనే డీబగ్ కార్యక్రమాన్ని ప్రారంభించింది.

మలేరియా, డెంగీ, జికా, చికున్‌గున్యా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నియంత్రించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అభివృద్ధి చేయడమే దీని లక్ష్యం. గత పదేళ్లుగా ప్రయోగశాలలు, పరిమిత ప్రాంతాల్లో పరీక్షలు నిర్వహించిన తర్వాత ఇప్పుడు పెద్ద స్థాయిలో అమలు చేయాలని యోచిస్తోంది.

నిజానికి దోమలపై ఇలా "వంధ్యీకరణ యుద్ధం" చేయడం ఇదే తొలిసారి కాదు. ప్రపంచంలోని అనేక దేశాల్లో ఇలాంటి పద్ధతులను ఇప్పటికే ప్రయోగించారు. అమెరికాలో ఆక్సిటెక్ అనే బయోటెక్ సంస్థ జన్యుమార్పిడి చేసిన దోమలను విడుదల చేసి మంచి ఫలితాలు సాధించింది. బ్రెజిల్, పనామా, కేమన్ దీవుల్లో నిర్వహించిన ప్రయోగాల్లో లక్ష్య దోమల జనాభా 8090 శాతం వరకు తగ్గినట్లు నివేదికలు వెల్లడించాయి.

అంతేకాదు, దశాబ్దాల క్రితమే ఇదే సూత్రాన్ని ఉపయోగించి మెడిటేరియన్ ఫ్రూట్ ఫ్లై అనే పంటల శత్రువైన ఈగలను, అలాగే పశువులకు ప్రమాదకరమైన న్యూ వరల్డ్ స్క్రూవార్మ్ పురుగులను కూడా అనేక దేశాలు విజయవంతంగా నియంత్రించాయి. అంటే ఈ పద్ధతి పూర్తిగా కొత్తది కాకపోయినా, దోమల నియంత్రణలో ఇంత భారీ స్థాయిలో వినియోగించేందుకు ప్రయత్నించడం మాత్రం విశేషం.



ఖర్చు విషయానికొస్తే.. గూగుల్ ఖచ్చితమైన సంఖ్యలను వెల్లడించలేదు. అయితే గతంలో డీబగ్ ప్రాజెక్ట్, సంబంధిత పరిశోధనల కోసం ఇప్పటికే వందల మిలియన్ డాలర్ల స్థాయిలో పెట్టుబడులు పెట్టినట్లు టెక్, బయోటెక్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రయోగశాలల్లో కోట్లాది దోమలను పెంచడం, వాటిని వేరు చేయడం, బ్యాక్టీరియాతో సంక్రమింపజేయడం, అనంతరం విడుదల చేయడం వంటి ప్రక్రియలు భారీ వ్యయంతో కూడుకున్నవే.

అయితే గూగుల్‌కు కొన్ని రిస్క్‌లు కూడా ఉన్నాయి. ఈ భారీ ప్రయోగంపై విమర్శలు వినిపిస్తున్నాయి . ప్రకృతిలో ఇంత భారీ స్థాయిలో జోక్యం చేసుకోవడం వల్ల పర్యావరణ సమతుల్యతపై ఎలాంటి ప్రభావం ఉంటుందన్న ప్రశ్నలు పర్యావరణవేత్తలు లేవనెత్తుతున్నారు. దోమల జనాభా తగ్గితే వాటిపై ఆధారపడే ఇతర జీవులపై ప్రభావం పడే అవకాశముందనే వాదన వినిపిస్తోంది. అయినప్పటికీ ప్రజారోగ్య నిపుణులు మాత్రం దీనిని ఆశాజనక ప్రయోగంగా చూస్తున్నారు.

ప్రతి ఏడాది ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల బారిన పడుతున్నారు. ఆ సమస్యను రసాయనాలపై ఆధారపడకుండా, ప్రకృతి సూత్రాలనే ఉపయోగించి నియంత్రించగలిగితే అది ప్రజారోగ్య రంగంలో పెద్ద ముందడుగుగా నిలుస్తుందని చెబుతున్నారు. ప్రపంచాన్ని ఇబ్బంది పెడుతున్న దోమలపై "మగ దోమల సైన్యం" నిజంగా విజయం సాధిస్తే.. భవిష్యత్తులో డెంగీ, మలేరియా నియంత్రణకు కొత్త దారి చూపే అవకాశముంది.



# మళ్లీ బాంబుల వాన

**ఇరాన్ రాడార్, డ్రోన్ వ్యవస్థలపై అమెరికా దాడి.. కువైట్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ ప్రతిదాడి**

**దుబాయ్/వాషింగ్టన్:** ఓవైపు పశ్చిమాసియాలో శాశ్వత శాంతిస్థాపనకు దౌత్యమార్గంలో చర్చలు జరుగుతుంటే మరోవైపు ఇరాన్, అమెరికా పరస్పర దాడులతో పశ్చిమాసియాలో బాంబులమోత మోగించాయి. గత వారం తమ అత్యాధునిక ఎంక్యూ-1 డ్రోన్‌ను ఇరాన్ క్షిపణులు కూల్చేసినందుకు ప్రతీకారంగా సోమవారం ఇరాన్‌కు చెందిన రాడార్ వ్యవస్థలపై అమెరికా బాంబుల వర్షం కురిపించింది. డ్రోన్లను ప్రయోగించే ప్రయోగకేంద్రాలనూ అమెరికా లక్ష్యంగా చేసుకుంది. అమెరికా దాడులకు ఇరాన్ ప్రతిదాడులతో ప్రతీకారంతీర్చుకుంది. అమెరికా వైమానిక స్థావరాలకు నిలయమైన కువైట్‌పై ఇరాన్ క్షిపణుల వర్షం కురిపించింది. డ్రోన్లతో తెగబడింది. వీటిలో దాదాపు అన్నింటినీ కూల్చేశామని కువైట్ పేర్కొంది. ''అంతర్జాతీయ జలాలపై నిఘా, పర్యవేక్షణ విధుల్లో ఉన్న తమ యూఎస్ ఎంక్యూ-1 డ్రోన్‌ను ఇరాన్ జలసమాధి చేసింది. అందుకే వాళ్ల రాడార్‌లను మేం నాశనంచేశాం. డ్రోన్ లాంఛింగ్ సైట్లను బూడిద చేశాం. గ్రౌండ్ కంట్రోల్ స్టేషన్, హార్ముజ్ జలసంధి గుండా మా రక్షణలో వెళ్తున్న వాణిజ్య నౌకలపై దాడికి బయల్దేరినా డ్రోన్లనూ నేలకూల్చాం. ప్రతిగా ఇరాన్ మొదలెట్టిన దాడుల్లో మా బలగాలకు, మా సైనిక సంపత్తికి ఎలాంటి నష్టం వాటిల్లలేదు''అని అమెరికా సైనిక సెంట్రల్ కమాండ్ సోమవారం ప్రకటించింది.ఆదివారం గెరూక్, ఖేష్మ్ ద్వీపం మీదా దాడులు చేశామని అమెరికా మిలటరీ పేర్కొంది. అయితే టెలికమ్యూనికేషన్ టవర్ మీద సైతం అమెరికా దాడిచేసిందని ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ కోర్ (ఐఆర్‌జీసీ) వెల్లడించింది. దౌత్యం జరుపుతూ దాడులు చేయడంపై ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘేల్ అసంతృప్తి వ్యక్తంచేశారు.

''మొదట్నుంచీ అమెరికా మమ్మల్ని నమ్మట్లేదు. చర్చలు సైతం అపనమ్మకంతో కొనసాగుతున్నాయి. అవిశ్వాస వాతావరణంలో దౌత్యం ఏనాటికీ కొలిక్కి రాదు''అని ఆయన వ్యాఖ్యానించారు. ''ఇరాన్ చక్కటి ఒప్పందం చేసుకునేందుకు సిద్ధంగా ఉంది. అమెరికా మాటిమాటికి బాంబులేయడం మానేసి ఓపికపడితే కుదురుకుంటుంది''అని ఆయన అన్నారు.

### భద్రంగా హార్మూజ్‌ను దాటిన 70 నౌకలు

అమెరికా బలగాల రక్షణంలో గత వారం రోజుల వ్యవధిలో ఏకంగా 70 వాణిజ్య నౌకలు హార్మూజ్ జలసంధి గుండా పయనించాయని అమెరికా సెంట్రల్ కమాండ్ సోమవారం వెల్లడించింది. పర్షియన్ గల్ఫ్ జలాలకు అటువైపు, ఇటువైపు ఈ నౌకలు సురక్షితంగా ప్రయాణించగలిగాయని అమెరికా అధికారులు వెల్లడించారని సోమవారం న్యూయార్క్ టైమ్స్ ఒక కథనం ప్రచురించింది. ముందుజాగ్రత్తగా నౌకలన్నీ తమ లొకేషన్‌ను చూపించే ట్రాన్స్‌పాండర్లను ఆఫ్ చేశాయని వెల్లడించింది.



### అమెరికాతో చర్చలను నిలిపేసిన ఇరాన్!

లెబనాన్‌పై ఇజ్రాయెల్ ఎడతెరిపి లేకుండా దాడులు చేస్తుండటంపై నిరసనగా అమెరికాతో దౌత్యచర్చలను నిలిపేస్తున్నట్లు ఇరాన్ సోమవారం ప్రకటించింది. ఈ మేరకు ఇరాన్ అధికారిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. గతంలో నిర్ణయించుకున్న తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులుచేస్తోందని ఇరాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. "దాడులకు నిరసనగా ఇకపై మధ్యవర్తులతో తమ దౌత్య ప్రతినిధులు చర్చలు జరపబోరు. తక్షణం లెబనాన్‌పై కాల్పులు, దురాక్రమణను ఇజ్రాయెల్ నిలిపేయాలి. బీరుట్ ఆక్రమణ ప్రయత్నాలను ఇజ్రాయెల్ విరమించుకోవాలి. ఇప్పటికే ఆక్రమించుకున్న సరిహద్దు ప్రాంతాల నుంచి ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్(ఐడీఎఫ్)బలగాలు వెనుతిరగాలి. ఈ దిశగా ఇజ్రాయెల్ తీసుకునే చర్చలతో మేం సంతృప్తి చెందేదాకా మధ్యవర్తులతో చర్చలపై ప్రతిష్టంభన ఇలాగే కొనసాగుతుంది. అప్పటిదాకా చర్చలకు వెళ్లే ప్రసక్తేలేదు"అని ఇరాన్ ఒక ప్రకటనలో పేర్కొందని ఇరాన్‌లోని మీడియాలో కథనాలొచ్చాయి. బీరుట్ సమీప దహియే జిల్లాపై దాడులను ముమ్మరంచేయాలని సోమవారం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ప్రకటించిన కొద్దిసేపటికే ఇరాన్ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.



మహా పత్రిక





# క్రేజీ సినిమాకు అద్భుతమైన వసూళ్లు

ఒకప్పుడు హనుమాన్ జంక్షన్, పుట్టింటికి రా చెల్లి లాంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకుల్ని అలరించిన అర్జున్ సర్జా ఇప్పుడు సహాయ పాత్రలే దాదాపుగా చేస్తున్నాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో 'సీతా పయనం' అనే తెలుగు మూవీతో దర్శకుడిగానూ ఓ ప్రయత్నం చేశాడు గానీ అస్సలు వర్కౌట్ కాలేదు. అలాంటి ఇతడు హీరోగా నటించిన ఓ చిత్రం ఇప్పుడు థియేటర్లలో అదరగొడుతోంది. కలెక్షన్స్ కూడా అలానే వస్తున్నాయి.

అర్జున్ సర్జా, అభిరామి, ప్రీతి ముకుందన్ ప్రధాన పాత్రలు చేసిన తమిళ సినిమా 'బ్లాస్ట్'. తెలుగులో దీన్ని 'బ్లాస్ట్ జోన్' పేరుతో రిలీజ్ చేశారు. లీడ్ రోల్స్ చేసిన ఎవరూ కూడా పెద్ద స్టార్స్ ఏం కాదు. ప్రమోషన్స్ కూడా సాధారణంగా చేసి వదిలేశారు. కానీ మూవీలో కంటెంట్ మాత్రం అద్భుతంగా ఉందని చూసిన ప్రతి ఒక్కరూ చెబుతున్నారు. మరీ ముఖ్యంగా సెకండాఫ్‌లో అర్జున్‌తో పాటు అభిరామి, ప్రీతి చేసే ఫైట్ సీక్వెన్స్ సూపర్ అని మెచ్చుకుంటున్నారు. ఇలా మౌత్ టాక్‌తోనే ఈ సినిమాకు రూ.25.26 కోట్ల గ్రాస్ వసూళ్లు వచ్చాయి. పెద్దగా స్టార్స్ లేని ఓ చిన్న సినిమాకు ఈ రేంజ్ వసూళ్లు వచ్చాయంటే అది హిట్ కిందే లెక్క. ఈ నంబర్స్ చూసిన చాలామంది అర్జున్ మార్కెట్ ఇంకా బతికే ఉందా అని మాట్లాడుకుంటున్నారు.



సుభాష్ కె రాజ్ అనే కుర్రాడు ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమయ్యాడు. 'బ్లాస్ట్' విషయానికొస్తే.. నీల (ప్రీతి ముకుందన్), ఆమె తండ్రి రాజారామ్ (అర్జున్), తల్లి (అభిరామి) ఈ ముగ్గురూ కరాటే మాస్టర్లే. వీళ్లకు కరాటే ట్రైనింగ్ సెంటర్‌తో పాటు ఓ మెడికల్ షాప్ ఉంటుంది. నీల ఓ రోజు షాప్‌లో ఉన్నప్పుడు కృపాకర్ (పవన్) గ్యాంగ్‌కి చెందిన ఓ రౌడీ ఆమెను బెదిరించి కొన్ని మందులు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తాడు. ఈ క్రమంలోనే ఆమె చేతిలో చావు దెబ్బలు తిని జైలుపాలవుతాడు. కానీ ఈ అరెస్ట్ తర్వాత కృపాకర్ గ్యాంగ్‌తో పాటు మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ అబ్రహం (అర్జున్ చిదంబరం).. నీల కుటుంబాన్ని అంతం చేయాలని ప్రయత్నిస్తారు. తర్వాత ఏమైంది? తమని నాశనం చేసేందుకు వచ్చిన శత్రువుల్ని నీల కుటుంబం ఎలా ఎదుర్కొంది? అనేది మిగతా సినిమా.

# టాలీవుడ్‌లో కొత్త సినిమాటిక్ యూనివర్స్?

ఇప్పుడు హీరోలు కూడా ట్రెండ్‌కి తగ్గట్లే సినిమాలు చేస్తున్నారు. ప్రస్తుతం వయలెన్స్, బీభత్సమైన యాక్షన్ లాంటి అంశాలతో సినిమాలు వస్తున్నాయి. నాని 'ద ప్యారడైజ్' ఈ తరహాలో ఉండబోతున్నట్లు తెలుస్తోంది. శ్రీకాంత్ ఓదెల తీస్తున్న ఈ మూవీలో ఇప్పుడు చిరంజీవి కూడా నటించబోతున్నారనే టాక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇంతకీ ఏంటి విషయం? 'దసరా'తో తనకు హిట్ ఇచ్చిన డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెలకు నాని మరో ఛాన్స్ ఇచ్చాడు. అదే 'ప్యారడైజ్'. లెక్క ప్రకారం ఈ పాటికే అంటే మార్చిలోనే రిలీజైపోవాలి. కానీ షూటింగ్ ఆలస్యం కావడంతో ఆగస్టుకి వాయిదా వేశారు. ఇప్పటివరకైతే ఆగస్టు 21న అని ఫిక్స్ అయ్యారు. ఈ చిత్ర క్లైమాక్స్ లోనే చిరంజీవి కనిపిస్తారనేది లేటెస్ట్ రూమర్. 'ప్యారడైజ్' మొదలైన కొన్నాళ్లకే చిరుశ్రీకాంత్ ఓదెల్ కాంబోపై ప్రకటన వచ్చింది. నాని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు క్లారిటీ ఇచ్చాడు. అయితే ఈ మూవీకి 'ప్యారడైజ్'తో లింక్ చేస్తున్నారట. అంటే రెండు చిత్రాల్లోని హీరోల పాత్రలకు ఒకదానికొకటి సంబంధం ఉంటుంది. అందుకు తగ్గట్లే శ్రీకాంత్ ఓదెల స్క్రిప్ట్ రాసుకున్నాడని అంటున్నారు. మరి ఇదే నిజమైతే 'ప్యారడైజ్' విషయంలో హైప్ పెరగడం గ్యారంటీ. అలానే టాలీవుడ్‌లో మరో సినిమాటిక్ యూనివర్స్ మొదలవుతుంది.





# 30 ఏళ్ల వయసొచ్చేసరికి ఆ విషయం తెలుసుకున్నా...

మనిషికి ఆరోగ్యమే మహాభాగ్యం. అందం కూడా ముఖ్యమే. అందం మనిషికి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. అందుకే సహజసిద్ధంగా వచ్చే సౌందర్యానికి మెరుగులు దిద్దుకోవడానికి తపన పడుతుంటారు. సినీ తారలకు అందం అనేది చాలా అంటే చాలా ముఖ్యం. ప్రతిభను పక్కన పెడితే అందమే వారికి కీలకం. అందుకే నిత్యం శరీరానికి అవసరమైన ప్రోటీన్లతో కూడిన ఆహారాన్ని తీసుకోవడంతోపాటు, శారీరక వ్యాయామాలు చాలా అవసరం. 20 ఏళ్ల వయసులో అందంగా ఉండడం పెద్ద విషయం కాదు. అయితే 30 ఏళ్ల తరువాత ఎదురయ్యే రోగాలతో శక్తి తగ్గడం వంటి విషయాల్లో జాగ్రత్త వహించడం పెద్ద విషయం. 30 ఏళ్ల తరువాత మనం ఎలా అరోగ్యంగా ఉండాలన్న విషయాలను వైద్యులు, వ్యాయామ నిపుణులు సూచనలు చేస్తుంటారు. అదే విధంగా ఫిట్‌నెస్ విషయంలో సినీ ప్రముఖులు సలహాలు ఇస్తుంటారు. నిత్యం కసరత్తులు చేసే వారిలో నటి రాశీఖన్నా ఒకరు.

ఈ 35 ఏళ్ల బ్యూటీ.. హిందీ, తెలుగు, తమిళంలో నటిస్తూ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. ముఖ్యంగా ఈ ఢిల్లీ బ్యూటీ తమిళంలోకి 'ఇమైకా నొడిగళ్' మూవీతో ఎంట్రీ ఇచ్చింది. నటిగా పుష్కరం పూర్తి చేసుకున్న రాశీఖన్నా.. ప్రస్తుతం తమిళంలో 'రౌడీ అండ్ కో'లో నటిస్తోంది. హిందీలోనూ రెండు చిత్రాలు చేస్తున్న ఈమె.. ఇటీవల అందం, ఆరోగ్యం గురించి మాట్లాడుతూ 20 ఏళ్ల వయసులో అందానికి మాత్రమే ప్రాధాన్యతనిచ్చే దాన్ని అని చెప్పుకొచ్చింది. 30 ఏళ్ల వయసులో ఆరోగ్యంగా ఉండడటమే ముఖ్యం అని తెలుసుకున్నానని పేర్కొంది. అందంగా ఉండడం మంచిదే కానీ, బరువు తగ్గాలనుకునే మహిళలు ప్రమాదకరమైన క్రాష్ డైట్ విధానాలను పక్కన పెట్టాలని పేర్కొంది. తమని ఇతరులతో పోల్చుకోకుండా పౌష్టికాహారం తీసుకుంటూ రూల్స్ పాటిస్తూ వ్యాయామాలు చేయాలని రాశీ ఖన్నా సలహా ఇచ్చింది.

ఊహలు గుసగుసలాడే మూవీతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చిన ఈమె.. తర్వాత బెంగాల్ టైగర్, సుప్రీమ్, జై లవకుశ, రాజా ది గ్రేట్, తొలిప్రేమ, ప్రతిరోజూ పండగే, తెలుసు కదా, ఉస్తాద్ భగత్ సింగ్ తదితర సినిమాలు చేసింది. కెరీర్ ప్రారంభంలో బొద్దుగా ఉండే ఈమె.. ఇప్పుడు నాజుగ్గా మారిపోయింది.



# లక్షల విలువైన నగలు దోచేసిన కేర్ టేకర్

బాలీవుడ్ నటి రవీనా టండన్ సోదరుడి ఇంట్లో గతేడాది అక్టోబరులో దొంగతనం జరిగింది. దాదాపు రూ.25 లక్షలు విలువైన బంగారం, వజ్రాల ఆభరణాలు, ఖరీదైన చేతి వాచీలు చోరీ చేసిన కేసులో 47 ఏళ్ల మహిళని ఇప్పుడు పోలీసులు అరెస్ట్ చేశారు. సదరు మహిళని రాశి ఛాబ్రియాగా గుర్తించారు. గత కొన్నేళ్లుగా ఈమె.. రవీనా తల్లి సంరక్షణ బాధ్యతలు చూసుకుంటోంది. ముంబై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గతేడాది అక్టోబరులో రవీనా కుటుంబ సభ్యులు, ఇంట్లోని లాకర్ పరిశీలించగా అది తెరిచి ఉంది. అలానే బంగారం, వజ్రాల ఆభరణాలు, రెండు కాస్ట్లీ చేతి వాచీలు కనిపించలేదు. వీటి మొత్తం విలువ రూ.25 లక్షలు అని అంచనా వేశారు. దీంతో రాజీవ్ టండన్ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేశారు. తొలుత రాశి ఛాబ్రియాని ప్రశ్నించగా.. దొంగతనం ఆరోపణలని ఖండించింది. తర్వాత నేరాన్ని ఒప్పుకొందని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. అయితే రెండు చేతి గడియారాలని తిరిగి ఇచ్చేసినప్పటికీ.. ఆభరణాలని మాత్రం జగదీష్ అనే వ్యక్తి దగ్గరున్నాయని చెప్పింది. ఎన్నిసార్లు అడిగినా అవి ఇవ్వకపోయేసరికి పోలీసులు లోతుగా దర్యాప్తు చేశారు. 2020 నుంచి రవీనా టండన్ సోదరుడి కుటుంబానికి బాగా దగ్గరైన రాశి.. ఇంట్లోని రెండో అంతస్తులో విలువైన ఆభరణాలు ఉంచే చోటుకి కూడా స్వేచ్ఛగా వెళ్లగలిగేంత నమ్మకం సంపాదించింది. తర్వాత అదును చూసి వాటిని దొంగిలించింది. అయితే పోలీసులకు దొరికిపోయిన తర్వాత తన సహచరుడిని పోలీస్ ఇన్ఫార్మర్‌గా టండన్ కుటుంబానికి పరిచయం చేసిన రాశి.. ఆభరణాల సంగతి వదిలేయకపోతే ఫేక్ డ్రగ్స్ కేసులో ఇరికిస్తామని కూడా బెదిరించింది. ఇదే విషయాన్ని రాజీవ్ టండన్ తన ఫిర్యాదులోనూ పేర్కొన్నారు. గత నెల 21న రాశి ఛాబ్రియాని అరెస్ట్ చేసిన జుహు పోలీసులు, ఆమెని కోర్టులో హాజరుపరచగా గత నెల 29వ తేదీ వరకు రిమాండ్ విధించారు. ప్రస్తుతం ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. రవీనా టండన్ గతంలో తెలుగులో హీరోయిన్‌గా పలు సినిమాలు చేసింది. ఈమె కూతురు రషా తడానీ.. మహేశ్ బాబు అన్నకొడుకు జయకృష్ణ హీరోగా నటిస్తున్న 'శ్రీనివాస మంగాపురం' మూవీతో టాలీవుడ్‌లో హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తోంది.

## 'హిరణ్యకశ్యప' పై త్రివిక్రమ్‌కి ఫోన్ చేశా.. అందుకే తప్పకున్నా : గుణశేఖర్

టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు గుణశేఖర్ తన కలల ప్రాజెక్ట్ 'హిరణ్యకశ్యప' నుంచి తప్పుకున్న సంగతి తెలిసిందే. బడ్జెట్ కారణంగా ఆయన ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. అయితే సినీ సర్కిల్‌లో మాత్రం ఈ ప్రాజెక్టు విషయంలో త్రివిక్రమ్ ఇన్వాల్వ్ అయ్యాడని.. అందుకే గుణశేఖర్ తప్పుకున్నట్లు గుసగుసలు వినిపించాయి. అంతేకాదు హిరణ్యకశ్యప చిత్రానికి త్రివిక్రమ్ దర్శకత్వం వహించబోతున్నారనే వార్తలు కూడా వినిపించాయి. తాజాగా ఈ రూమర్లపై గుణశేఖర్ స్పందించారు. బడ్జెట్ ఎక్కువతుందనే కారణంతోనే సినిమా నుంచి తప్పుకున్నానని.. త్రివిక్రమ్‌తో దీనికి ఎలాంటి సంబంధం లేదన్నాడు. అంతేకాదు త్రివిక్రమ్ ఈ సినిమాకు దర్శకత్వం వహించడం లేదని స్పష్టం చేశాడు. ఈ రూమర్స్‌కు చెక్ పెట్టేందుకు తానే స్వయంగా త్రివిక్రమ్‌కు ఫోన్ చేసినట్లు తెలిపారు. తాజాగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'హిరణ్యకశ్యప చిత్రానికి త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్నారనే పుకార్లు నా వరకు వచ్చాయి. దీంతో వెంటనే నేను త్రివిక్రమ్‌కి ఫోన్ చేసి అడిగాను. దానికి ఆయన స్పందిస్తూ.. కేవలం రైటింగ్ (కథ,మాటలు) విభాగంలో మాత్రమే తాను ఉన్నానని.. దర్శకత్వం వహించే ఆలోచన లేదని చెప్పాడు' అని గుణశేఖర్ అన్నారు. ఇక తాను ఈ ప్రాజెక్టు నుంచి ఎందుకు తప్పుకోవాల్సి వచ్చిందో కూడా వివరించాడు. ఈ సినిమాను నిర్మించేందుకు మొదట ఫాక్స్ స్టూడియోస్, డిస్నీ వంటి ప్రముఖ సంస్థలు ముందుకు వచ్చాయి. ఈ కథను అనుకున్న రీతిలో వెండితెరపై చూపించాలంటే దాదాపు రూ. 300 కోట్ల భారీ బడ్జెట్ అవసరమవుతుందని లెక్కలు తేలాయి. అప్పుడు డిస్నీ లాంటి సంస్థలు కూడా వెనక్కు తగ్గాయి. బడ్జెట్ పరిమితులు, ఆచరణాత్మక ఇబ్బందుల కారణంగా ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకోవాలని వచ్చింది అని గుణశేఖర్ స్పష్టం చేశాడు.





# నన్ను నేను టార్చర్ పెట్టుకున్నా.. మీరలాంటివి చేయొద్దు!

**సౌత్‌లో స్టార్ స్టేటస్ అందుకుని నార్త్ లో సెటిలైపోయిన హీరోయిన్లలో తాప్సీ పన్ను ఒకరు. తెలుగు, తమిళ భాషల్లో అనేక సినిమాలు చేసిన ఈ బ్యూటీ కొన్నేళ్లుగా తన ఫోకస్ అంతా బాలీవుడ్‌పైనే పెట్టింది. వరుసగా హిందీ సినిమాలే చేస్తోంది. తాజాగా తాప్సీ తాను గతంలో ఓ తప్ప చేశానని, అలాంటి తప్ప ఇంకెవరూ చేయకూడదని సుతిమెత్తగా హెచ్చరిస్తోంది.**

**ఫ్లాట్‌గా ఉండే నడుము కోసం..**

ఈమేరకు ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో తాప్సీ ఓ పోస్ట్ పెట్టింది. 'నాకు నాజూకైన నడుము కావాలని చిన్నప్పటినుంచే అనుకునేదాన్ని. కొంచెం కూడా పొట్ట పైకి కనిపించకూడదని కోరుకునేదాన్ని. అంతా ఓకే కానీ, నడుము కింది భాగంలో కొవ్వు పేరుకుపోయి ఉండేది. ఈ లోయర్ బెల్లీ ఫ్యాట్ ఎందుకు వచ్చిందనేది అస్సలు అర్థమయ్యేది కాదు. దాన్ని తగ్గించుకోవడం కోసం ఎక్కువ వ్యాయామాలు చేశాను. సామర్థ్యానికి మించి వ్యాయామం చేసినప్పుడు నా శరీరం మెదడుకు హెచ్చరికలు పంపేది.

**అది కొవ్వు మాత్రమే కాదు**

శరీరం నుంచి నీరు బయటకు వచ్చేయడానికి బదులు దాన్ని నిల్వ ఉంచుకోవడం మొదలు పెడుతుంది. బెల్లీ ఫ్యాట్ అంటే అక్కడ కొవ్వు పేరుకుపోవడం మాత్రమే కాదు, కొందరిలో కొవ్వుకు బదులుగా నీళ్లు నిల్వ ఉంటాయి. వర్కవుట్స్ ఎక్కువ చేస్తే ఆ బెల్లీ ఫ్యాట్ తగ్గడం కాదు కదా.. మరింత పెరుగుతుంది. కాబట్టి నేను చేసిన తప్పు ఇంకెవరూ చేయొద్దని చెప్తున్నాను.

**శరీరాన్ని హింసించకండి**

ప్రతి మహిళకు భిన్నమైన శరీరం ఉంటుంది. హార్మోన్ల మార్పుల వల్ల మన శరీరం ఎప్పటికప్పుడు మారుతూనే ఉంటుంది. దాన్ని మీరు ఒప్పుకునే తీరాలి. నన్ను నేను చాలా టార్చర్ పెట్టుకున్న తర్వాత ఆలస్యంగా ఈ విషయం అర్థం చేసుకున్నాను. మా డాక్టర్ ఏం చెప్పిందంటే.. పొట్ట కింద కొద్దిగా కొవ్వు, నీరు నిల్వ ఉండటం అవసరమని తెలిపింది.

**ఆరోగ్యానికి మంచిదే**

అక్కడున్న అవయవాలకు అవి రక్షణగా పని చేస్తాయంది. కాబట్టి ప్రతి మహిళకు లోయర్ బెల్లీ ఫ్యాట్ ఉండటం మంచిదే! సోషల్ మీడియాలో దిగే ఫోటోల కోసం మీ శరీరాన్ని మీరు హింసించుకోకండి. కొంచెం కొవ్వు ఆరోగ్యానికి మంచిదేనని భావించండి' అని రాసుకొచ్చింది. తాప్సీ చివరగా 'అస్సి' సినిమాలో నటించింది. ప్రస్తుతం హిందీలో రెండు మూవీస్ చేస్తోంది.

OWNED BY N SREENIVAS RAO. EDITED, PRINTED AND PUBLISHED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com